

హైదరాబాద్
సోమవారం, 14.09.2026

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in | @mudranews

www.mudranews.in

వినాయక చవితి శుభాకాంక్షలు

ఈ రోజు సోమవారం (14.09.2026) కార్యాలయానికి సెలవు. కావున 15వ తేదీ మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం (16.09.2026).
-ఎడిటర్

సంపుటి:13 సంచిక: 315
పేజీలు: 08 వెల: రూ. 5


## ముగిసిన బ్రిక్స్ సదస్సు

### ప్రపంచ దేశాధినేతలకు ప్రధాని కృతజ్ఞతలు

- చైనాకు తదుపరి బ్రిక్స్ సదస్సు బాధ్యతలు
- ప్రపంచ సవాళ్లపై బ్రిక్స్ దేశాలు కలిసి పనిచేయాలి
- టెక్నాలజీ, ఖనిజాలను ఆయుధాలుగా మార్చొద్దు
- ఆలోచనలు కాదు.. ఫలితాలు కావాలన్న మోదీ

02




కొండా ఇష్యూలో

## కీలకమలుపు

బుజ్జగింపులకు దిగిన కాంగ్రెస్ హైకమాండ్?



- సురేఖకు కేబినెట్ హోదా పదవి ఇస్తారా?
- వెంటనే ఢిల్లీకి రావాలంటూ అధిష్ఠానం పిలుపు
- మీనాక్షి నటరాజన్ ఫోన్.. పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలని సూచన
- అనుచరులతో సురేఖ భేటీ.. ఢిల్లీ పిలుపుపై కీలక చర్చ

02

**NH-65 విస్తరణకు**

# ప్రభుత్వం రెడీ

## ఏపీ-తెలంగాణ ఇక రహదారి

- హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి 6 లేన్లుగా విస్తరణకు భూసేకరణ ప్రారంభం
- నల్గొండలో 6.32 హెక్టార్ల భూసేకరణ
- 70 సర్వే నంబర్లలో భూముల సేకరణ
- 21 రోజుల్లో అభ్యంతరాలు తెలపాలి

**ముద్ర డెస్క్:**
తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత కీలకమైన రహదారి మార్గాల్లో ఒకటైన హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి-65 (NH-65)కు మహర్దశ పట్టనుంది. తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే ప్రధాన మార్గాన్ని 6 వరుసలుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా భూసేకరణ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. నల్గొండ జిల్లా పరిధిలోని 62.20 కిలోమీటర్ నుంచి 126.800 కిలోమీటర్ వరకు రహదారి విస్తరణకు సంబంధించి కేంద్ర రహదారి, రవాణా శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.

**6.32 హెక్టార్ల భూసేకరణ**

NH-65 విస్తరణలో భాగంగా నల్గొండ జిల్లాలోని చిట్యాల, కట్టంగూర్, నార్కెట్‌పల్లి, నకిరేకల్, కేతేపల్లి మండలాల్లో భూములను సేకరించనున్నారు. ఆయా మండలాల పరిధిలోని వెలిమినేడు, వట్టిమర్తి, చిట్యాల, నార్కెట్‌పల్లి, యల్లారెడ్డిగూడెం, చెరువుగట్టు, పామనగుండ్ల, దుగ్నేవల్లి, అయిటిపాముల, చందంపల్లి, నకిరేకల్, కొర్లపహాడ్, ఇనుపాముల గ్రామాల్లోని 70 సర్వే నంబర్లలో ఉన్న భూములను సేకరించేందుకు చర్యలు చేపట్టారు. మొత్తం 6.32 హెక్టార్ల వ్యవసాయ, వ్యవసాయేతర భూములను ఈ ప్రాజెక్టు కోసం తీసుకోనున్నారు.

**21 రోజుల్లో అభ్యంతరాలు**

జాతీయ రహదారుల చట్టం–1956లోని సెక్షన్ 3ఏ(1) కింద కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. భూసేకరణకు సంబంధించి భూయజమానులు లేదా ఇతర సంబంధిత వ్యక్తులకు ఏవైనా అభ్యంతరాలు, సూచనలు, సవరణలు ఉంటే 21 రోజుల్లోగా సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి (RDO) దృష్టికి తీసుకురావాలని ప్రభుత్వం సూచించింది. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తదుపరి ప్రక్రియను పూర్తి చేసి తుది భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

**రద్దీకి చెక్.. ప్రయాణానికి ఊరట**

హైదరాబాద్–విజయవాడ మార్గం 2 రాష్ట్రాల మధ్య నిత్యం వేలాది వాహనాల రాకపోకలకు ప్రధాన మార్గంగా ఉంది. ముఖ్యంగా సంక్రాంతి, దసరా, దీపావళి, ఇతర పండుగల సమయంలో ఈ రహదారిపై భారీగా ట్రాఫిక్ పెరుగుతోంది. రహదారిని 6 లేన్లుగా విస్తరించడం ద్వారా వాహనాల రాకపోకలు సులభతరం కావడంతో పాటు ప్రయాణ సమయం తగ్గే అవకాశం ఉంది. పారిశ్రామిక, వాణిజ్య రవాణాకు కూడా ఈ విస్తరణ మరింత ఊతమివ్వనుంది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మెరుగైన రహదారి కనెక్టివిటీకి ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.



హిట్ లిస్ట్‌లో

## భారత్..

- 1998లోనే లాడెన్ గురి?
- 9/11కు ముందే భారత్‌కు ముప్పు హెచ్చరిక
- సీఐఏ పత్రాల్లో భారత్ పేరు..
- లాడెన్ టార్గెట్ జాబితాలో భారత్!
- 28 ఏళ్ల నాటి రహస్యం బయటకు..

02



నా స్వామినా గుర్తించింది

## రోశయ్యే

ఆవేశానికి ఆలోచన తోడైతే భవిష్యత్ బాగుంటుందన్నారు

సభలో నా ఆవేశం చూసి పిలిపించి మాట్లాడారు

- రోశయ్య దూరదృష్టితోనే మిగులు బడ్జెట్
- ఆర్యవైశ్యుల సేవలను కొనియాడిన సీఎం రేవంత్
- ఆత్మగౌరవ భవనానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

02





## సారీ చెప్పమన్నారు

### పదవి కంటే ఆత్మగౌరవమే ముఖ్యం

- సారీ చెప్పేందుకు సురేఖ నో
- కాంగ్రెస్‌ను వీడేది లేదు
- ఢిల్లీ పిలుపులపై సురేఖ మౌనం
- సురేఖ వివాదంపై కొండా మురళీ కీలక వ్యాఖ్యలు



**ముద్ర, వరంగల్:**
మాజీ మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై ఆమె భర్త కొండా మురళీ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి కాగితంపై 'సారీ' అని రాసి ఇస్తే మంత్రి పదవి కొనసాగుతుందని సూచించినప్పటికీ.. సురేఖ క్షమాపణ చెప్పేందుకు నిరాకరించారని తెలిపారు. పదవి పోయినా ఆత్మగౌరవం విషయంలో రాజీపడబోనని ఆమె స్పష్టం చేసినట్లు చెప్పారు.
పదవులు శాశ్వతం కాదని, ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి పదవిలో కొనసాగడం తమకు ఇష్టం లేదని మురళీ వ్యాఖ్యానించారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.
కాగా, సురేఖను ఢిల్లీకి రావాలని అధిష్ఠానం నుంచి పలుమార్లు పిలుపులు వచ్చినా ఆమె వెళ్లలేదని మురళీ వెల్లడించారు. ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యపైనా ఆయన వ్యాఖ్యలు చేస్తూ.. దమ్ముంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని సవాల్ విసిరారు.

## మట్టితో గణపతి

# ప్రకృతితో మమేకం

### గణపయ్య పూజలో పర్యావరణ సందేశం

- సనాతన సంప్రదాయంలో ప్రకృతి పరిరక్షణ
- వినాయక చవితి వేళ ప్రకృతి హిత సంకల్పం

మట్టి విగ్రహంతో పర్యావరణానికి మేలు



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:**
నవరాత్రుల శోభతో వీధులన్నీ వినాయక చవితి పండుగ వాతావరణంలో మునిగితేలుతున్నాయి. ప్రతి ఇంటా, ప్రతి మంటపంలోనూ విఘ్నేశ్వరుని నామస్మరణ మారుమోగుతోంది. ఆదిపూజ్యుడైన గణపయ్య పండుగను మనం ఏటా ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటాం. ఈ పండుగ వెనుక కేవలం ఆధ్యాత్మిక భావన మాత్రమే కాకుండా, అపారమైన మానవీయ కోణం, ప్రకృతి పట్ల మన సనాతన ధర్మం చూపించిన అమూల్యమైన గౌరవం దాగి ఉన్నాయి. మిగతా 02లో

## తెలంగాణపై పవన్ కొత్త స్కెచ్

తెలంగాణపై జనసేన కీలక నిర్ణయం

- ఇప్పటికే నియోజకవర్గాల సమావేశాలు పూర్తి
- 22ఏ భూములు, ఫీజు రీయింబర్స్ మెంట్ పై పోరాటాలు
- త్వరలో రాష్ట్రంలో పవన్ కల్యాణ్ పర్యటన

02



## ఛేదించిన ఆయుధాల మిస్టరీ

### బొల్లారం మద్రాస్ రెజిమెంట్ వెపన్స్ చోరీ కేసులో 11 రోజుల ఉత్కంఠభరిత దర్యాప్తు

03

- 500 సీసీ కెమెరాలు.. సెకన్ టు సెకన్ ఫుటేజ్ స్కానింగ్..
- చివరకు మాజీ సైనిక ఉద్యోగి మల్లేష్ అరెస్ట్



## 21 రాష్ట్రాల్లో సివిల్ కోడ్

2029 లోగా ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో యూసీసీ

02

- ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఉమ్మడి పౌరస్మృతి చట్టాలు
- ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానాన్ని కొనసాగిస్తాం
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు




ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 14.09.2026
www.mudranews.in | @mudranews



## వైరల్ జ్వరాలు రాకుండా..



ఇంట్లో దుమ్ము, చెత్త, నిల్వ నీరు లేకుండా చూసుకోవాలి. తలుపుల హ్యాండిల్స్, టేబుల్స్, మొబైల్ వంటి తరచూ తాకే వస్తువులను శుభ్రంగా ఉంచడం ద్వారా ఇన్ఫెక్షన్ల వ్యాప్తిని తగ్గించవచ్చు.




TOP SECRET
PDB
(28 August 1998) Bin Ladin Terrorist Network Still a Threat
[redacted] Bin Ladin and other terrorist leaders based in Afghanistan survived the US strikes and their communications network remains intact. [redacted] training had resumed in some camps, and other camps were being moved, [redacted]
- Bin Ladin can call on a network of individuals and allied groups in at least 60 countries to conduct attacks.

Hours before the US missile strikes, Bin Ladin [redacted] was looking at options for further attacks against the US as well as the UK [redacted]. Bin Ladin did not indicate precise targets or timing.
- US officials recently assisted in the arrest of Bin Ladin operatives preparing attacks in Tirana and possibly Baku, but [redacted]
- [redacted] Bin Ladin intends to conduct attacks in Egypt, the Arabian Peninsula—especially Kuwait, Saudi Arabia, and Yemen—India, Pakistan, Uganda, and possibly Nigeria.

Bin Ladin's well-established infrastructure in North America, Europe, and East Asia lends credibility to reports that he also will target US interests in these regions. [redacted] Bin Ladin authorized him to explore attacks in the US.
- [redacted] earlier this year reported that Bin Ladin was considering attacks in the US.
- [redacted] our Embassy in [redacted] is a possible target, and [redacted] Bin Ladin-related threats against US facilities in [redacted]

# హిట్ లిస్ట్ లో భారత్

**ముద్ర ఢిల్లీ :**
9/11 దాడులకు మూడేళ్ల ముందే భారత్ సహా పలు దేశాలపై ఒసామా బిన్ లాడెన్ నేతృత్వంలోని అల్‌ఖైదా నెట్‌వర్క్ దృష్టి పెట్టినట్లు అమెరికా నిఘా పత్రాలు వెల్లడిస్తున్నాయి. 1998 ఆగస్టు 28న రూపొందించిన 'బిన్ లాడెన్ టెర్రరిస్ట్ నెట్‌వర్క్ స్టిల్ ఎథ్రెట్' అనే ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్‌లో భారత్ పేరు ప్రస్తావనకు వచ్చింది. భారత్‌తో పాటు పాకిస్థాన్, ఈజిప్ట్, సౌదీ అరేబియా, యెమెన్, కువైట్, ఉగాండా, నైజీరియా వంటి దేశాల్లో దాడుల అవకాశాలను అల్‌ఖైదా పరిశీలిస్తున్నట్లు ఆ పత్రాలు సూచించాయి. అయితే భారత్‌లో ఏ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకున్నారు లేదా ఎలాంటి దాడికి ప్రణాళిక వేశారనే నిర్దిష్ట వివరాలు మాత్రం అందుబాటులో లేవు.

ఈ పత్రాలు మరో కీలక విషయాన్ని కూడా వెల్లడిస్తున్నాయి. 1990ల చివరి నాటికే అల్‌ఖైదా ఒక దేశానికే పరిమితమైన సంస్థ కాకుండా అంతర్జాతీయ ఉగ్ర నెట్‌వర్క్‌గా విస్తరిస్తోందని అమెరికా నిఘా సంస్థలు గుర్తించాయి. బిన్ లాడెన్ నుంచి పెరుగుతున్న ముప్పుపై అప్పటి అమెరికా అధ్యక్షులకు కూడా పలుమార్లు హెచ్చరికలు వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే ఈ హెచ్చరికల తర్వాత కూడా 2001 సెప్టెంబర్ 11న అల్‌ఖైదా అమెరికాపై భీకర దాడికి పాల్పడింది. నాలుగు విమానాలను హైజాక్ చేసిన ఉగ్రవాదులు వాటిని కీలక ప్రాంతాలపైకి మళ్లించడంతో దాదాపు 3,000 మంది ప్రాణాలు కోల్పోయారు.

అందుకే 1998 నాటి పత్రాల్లో భారత్ పేరు కనిపించడం ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది భారత్‌పై నిర్దిష్ట దాడి కుట్ర సిద్ధమైందని నిరూపించకపోయినా, 9/11కు ఏళ్ల ముందే అంతర్జాతీయ ఉగ్రవాద ముప్పు ఎంత విస్తృతంగా ఉందో తెలియజేసే కీలక ఆధారంగా నిలుస్తోంది.

# తెలంగాణపై పవన్ కొత్త స్కెచ్

**ముద్ర డెస్క్ :**
జనసేనాని పవన్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఏపీలో కూటమిలో భాగస్వామిగా ఉన్న పవన్ తెలంగాణ కేంద్రంగా కొత్త స్కెచ్ సిద్దం చేస్తున్నారు. బీజేపీ తాము ఒంటరిగానే పోటీ చేస్తామని ఇప్పటికే ప్రకటించింది. దీంతో.. పవన్ సైతం తన రూటు తాను డిసైడ్ చేస్తున్నారు. అందులో భాగంగా సామాజిక సమీకరణాల ఆధారంగా కొత్త నిర్ణయాలతో ముందుకు వెళ్తున్నారు. పవన్ టార్గెట్ ఫిక్స్ అయింది. దీంతో.. కొత్త లెక్కలు తెర మీదకు వస్తున్నాయి.

తెలంగాణలో రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. ఇప్పటికే బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య నువ్వా నేనా అన్నట్లుగా సాగుతున్న రాజకీయంతో బీజేపీ పోటీ పడుతోంది. తామే తిరిగి అధికారంలోకి వస్తామని సీఎం రేవంత్ పదే పదే చెబుతున్నారు. తాము తిరిగి అధికారంలోకి రావటం ఖాయమని బీఆర్ఎస్ నేతలు ధీమాగా ఉన్నారు. ఇదే సమయంలో బీజేపీ సైతం తమ పట్టు పెంచుకునే వ్యూహాలను అమలు చేస్తోంది. బీజేపీ అధినాయకత్వం సైతం తెలంగాణ పైన ప్రత్యేకంగా ఫోకస్ చేయటంతో రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. కాగా.. ఏపీ డిప్యూటీ సీఎం.. జనసేనాని పవన్ కొత్త వ్యూహాలు సిద్దం చేస్తున్నారు. బీజేపీ తాము ఒంటరిగానే పోటీ చేస్తామని చెబుతున్న వేళ.. పవన్ సైతం తమ పార్టీ సింగిల్ గా కంటెస్ట్ చేసేందుకు సమాయత్తం కావాలని నిర్దేశిస్తున్నారు. అందులో భాగంగా తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు.

**జనసేన తెలంగాణ నేతలు**
పార్లమెంటరీ వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. వచ్చే ఎన్నికలకు సమాయత్తం కావాలని నిర్దేశిస్తున్నారు. పవన్ కల్యాణ్ త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల పర్యటన లకు సిద్దం అవుతున్నట్లు పార్టీ నేతలు వెల్లడించారు. గ్రేటర్ తో సహా అన్ని ఎన్నికల్లోనూ పార్టీ పోటీలో ఉంటుందని ప్రకటించారు. ఏపీలో స్థానిక సంస్థలు పూర్తయిన తరువాత పవన్ తెలంగాణ పైన ఫోకస్ చేస్తారని.. అందులో భాగంగా ముందుగా గ్రేటర్ లో పార్టీ బలోపేతం పైన నిర్ణయాలు ఉంటాయని.. అదే విధంగా ప్రతీ పార్లమెంట్ పరిధిలోనూ పార్టీ సమావేశాల నిర్వహణకు వీలుగా కార్యాచరణ సిద్దం చేస్తున్నారు. పవన్ రాజకీయం బీఆర్ఎస్– కాంగ్రెస్ లక్ష్యంగా సాగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే.. పవన్ తీసుకుంటున్న తాజా నిర్ణయాలు రాజకీయంగా జనసేనకు ఎంత వరకు కలిసి వస్తాయి.. తెలంగాణలో ఎలాంటి ప్రభావం చూపుతాయనే చర్చ ఆసక్తిగా మారుతోంది.

# 21 రాష్ట్రాల్లో 'సివిల్ కోడ్'

**ముద్ర ఢిల్లీ :**
దేశవ్యాప్తంగా యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ) అమలుపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సంచలన ప్రకటన చేశారు. 2029లోగా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పాలిత 21 రాష్ట్రాల్లో యూసీసీ అమలు చేస్తామని ఆయన అన్నారు. ఆదివారం ముంబైలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మతంతో సంబంధం లేకుండా వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత వంటి వ్యక్తిగత అంశాలకు ఒకే రకమైన చట్టపరమైన నిబంధనలు వర్తింపచేయాలనే ఉద్దేశంతో బీజేపీ 'ఉమ్మడి పౌరస్మృతి' ని తీసుకువస్తోంది.

ఇప్పటికే పలు బీజేపీ రాష్ట్రాలు యూసీసీ చట్టాలు చేశాయి. మిగిలిన ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో కూడా దీనిని తీసుకువస్తామని అమిత్ షా ప్రకటించారు. దేశ భద్రతను ప్రస్తావిస్తూ.. సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదంపై బీజేపీ ప్రభుత్వం 'జీరో టాలరెన్స్' విధానాన్ని కొనసాగిస్తుందని చెప్పారు. అన్ని రంగాల్లో భద్రతకు అధిక ప్రాధానత్య ఇస్తున్నట్లు చెప్పారు. అక్రమ వలసదారుల్ని గుర్తించి, ఏరివేస్తాం.

2014కు ముందు దేశం అవినీతి, కులతత్వం, కుటుంబ రాజకీయాల వల్ల ప్రభావితమైందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పనితీరు ఆధారంగా రాజకీయాలు కొనసాగుతున్నాయని అన్నారు. 'ఇండియా ఫస్ట్' అనే విధానం ద్వారా భారత విదేశాంగ, రక్షణ విధానాలకు బలమైన పునాది ఏర్పడిందని అన్నారు. ఒకప్పుడు ''ఫ్రాజైల్ ఫైవ్'' ఆర్థిక వ్యవస్థగా చూసిన భారత్, ఇప్పుడు ప్రపంచంలోనే టాప్–5 ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా చేరిందని అన్నారు. మణిపూర్ లో ఎన్ఆర్సీ అమలుపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

ప్రధాని నరేంద్ర మోడీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తున్నట్లు అమిత్ షా ప్రకటించారు. మోడీ పుట్టిన రోజునే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలపై మాట్లాడుతూ.. భారత ప్రజాస్వామ్య దేశమని, ప్రజలు నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం గౌరవిస్తుందని అమిత్ షా అన్నారు.

# కొండా ఇష్యూలో కీలక మలుపు



**ముద్ర, వరంగల్ న్యూస్:**
తెలంగాణ రాజకీయాల్లో మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కొండా సురేఖ వ్యవహారం ఆసక్తికర మలుపు తిరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సురేఖను బుజ్జగించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం ప్రయత్నాలు ప్రారంభించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇందులో భాగంగా ఆమెకు కేబినెట్ హోదా కలిగిన కీలక పదవి ఇచ్చే అంశాన్ని ఢిల్లీ పెద్దలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. సురేఖను వెంటనే ఢిల్లీకి రావాలని అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సైతం సురేఖతో ఫోన్‌లో మాట్లాడినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ తీసుకునే నిర్ణయాన్ని గౌరవించాలని, ప్రస్తుత పరిస్థితుల్లో అధిష్ఠానంతో సమన్వయం చేసుకోవాలని ఆమెకు సూచించినట్లు సమాచారం.

**అనుచరులతో కీలక భేటీ**
ఈ నేపథ్యంలో కొండా సురేఖ ఇవాళ హన్మకొండలో తన అనుచరులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన పిలుపు, అధిష్ఠానం ప్రతిపాదిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్న అంశాలు, భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై ఆమె వారితో చర్చించే అవకాశం ఉంది. సురేఖకు ఏ పదవి ఇవ్వబోతున్నారు? దాని ద్వారా ఆమెను ఎలా సముదాయించబోతున్నారు? అనే అంశాలు ప్రస్తుతం కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. కేబినెట్ హోదాతో కూడిన పదవి ఇస్తే అది ఏ దనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. నామినేటెడ్ పదవా? లేక ప్రభుత్వంలో కీలక బాధ్యతా? అనే చర్చ కూడా జరుగుతోంది. అయితే దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

**కార్యకర్తల సమావేశంలో వ్యాఖ్యలు**
ఇదిలా ఉంటే కార్యకర్తలతో జరిగిన సమావేశంలో కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తన రాజకీయ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ తాను ఏనాడూ వెనక్కి తగ్గలేదనే భావనను ఆమె వ్యక్తం చేశారు. 'ఆ రోజు మహానీయుడు రాజశేఖర్ రెడ్డి గారి కోసం రాజీనామా చేసినా.. ఏ రోజు బాధపడలేదు. అప్పట్లో జగన్ గారి పార్టీలో చేరాం. తెలంగాణ వచ్చిన తర్వాత తప్పని పరిస్థితుల్లో బయటకు వచ్చాం' అని సురేఖ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఆమె రాజకీయ ప్రయాణంలోని కీలక దశలను గుర్తుచేసేలా ఉన్నాయి. వైఎస్ రాజశేఖర్ రెడ్డితో ఉన్న అనుబంధం, అనంతరం వైఎస్ జగన్ నేతృత్వంలోని పార్టీలో చేరడం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు.. ఇలా తన ప్రయాణాన్ని సురేఖ కార్యకర్తల వద్ద ప్రస్తావించారు.

**ఢిల్లీ నిర్ణయంపైనే ఉత్కంఠ**
ప్రస్తుతం సురేఖ వ్యవహారంలో కాంగ్రెస్ హైకమాండ్ తీసుకునే నిర్ణయంపైనే ఉత్కంఠ నెలకొంది. ఆమెను ఢిల్లీకి పిలిపించి చర్చించిన తర్వాత ఏ బాధ్యత అప్పగిస్తారనేది కీలకంగా మారింది. మరోవైపు, తన అనుచరులతో సమావేశమైన అనంతరం సురేఖ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది కూడా ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్ అధిష్ఠానం ఒకవైపు అసంతృప్తిని చల్లార్చేందుకు ప్రయత్నిస్తుండగా.. మరోవైపు సురేఖకు కీలక పదవి ఇవ్వడం ద్వారా ఆమెకు రాజకీయంగా ప్రాధాన్యం కొనసాగించే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే తుది నిర్ణయం ఢిల్లీలో జరిగే చర్చల తర్వాతే స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# నా స్టామినా గుర్తించింది రోశయ్యే




**ముద్ర, హైదరాబాద్:**
తనకు రాజకీయాల్లో సుదీర్ఘ భవిష్యత్ ఉందని మొదట గుర్తించింది దివంగత నేత రోశయ్యేనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో తాను దూకుడుగా మాట్లాడుతుంటే ఆవేశం తగ్గించుకోవాలని ఆయన చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. తన ఆవేశానికి ఆలోచన తోడైతే మంచి భవిష్యత్ ఉంటుందని ఆయన సలహా ఇచ్చారని చెప్పారు. రోశయ్య ఎవరినైనా విమర్శిస్తారు కానీ దూషించరన్నారు. హైదరాబాద్ తోనే నా అనుబంధం ముడిపడి ఉందని రోశయ్య ఎప్పుడూ చెప్పేవారు.. అందుకే ఆయన విగ్రహం హైదరాబాద్ లో ఉండాలని నిర్ణయించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎంలు ఎంత మంది మారిన ఆర్థిక శాఖ మంత్రిగా రోశయ్యనే ఉన్నారని.. ప్రభుత్వ సొమ్మును ఆయన పొదుపుగా వాడేవారని చెప్పారు. రోశయ్య దూరదృష్టి వల్లే తెలంగాణకు మిగులు బడ్జెట్ వచ్చిందని పేర్కొన్నారు.

ఆదివారం (సెప్టెంబర్ 13) హైదరాబాద్ ఉప్పల్ భగాయత్ లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో రెండే వృత్తులు ఉన్నాయని.. ఒకటి వ్యవసాయం.. రెండు వ్యాపారమని అన్నారు. వ్యాపారంలో మెలికలు తెలిసినోళ్లు ఆర్యవైశ్యులేనన్నారు.

ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం ఉన్నోళ్లని అన్నారు. పేదరికం ఉన్న ఆర్యవైశ్యులు కడుపులో దాచుకుంటారన్నారు. ఆర్యవైశ్యులు ఎంతో మంది పేదవారి ఆకలి తీరుస్తున్నారని కొనియాడారు. ఆర్యవైశ్యులు పేదలకు ఉదారంగా అప్పులు ఇస్తారన్నారు. ఆర్యవైశ్యులు ఆర్థిక క్రమశిక్షణ కలిగినవారని.. ఆర్థిక లావాదేవీల్లో సలహాల కోసం వారినే అడుగుతారన్నారు. ఆర్యవైశ్యుల బిడ్డ మహాత్మా గాంధీ అంటే ప్రపంచంలో తెలియనివారు లేరన్నారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు ఆర్యవైశ్యుడేనని పేర్కొన్నారు. ఆర్యవైశ్య సమాజం నుండి గొప్ప వ్యక్తులు దేశానికి, రాష్ట్రానికి సేవలు అందించారని కొనియాడారు. ఆత్మగౌరవ భవనం పేద ఆర్యవైశ్య బిడ్డలకు ఉపయోగపడాలన్నారు. భవన నిర్మాణ విషయంలో అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఆర్యవైశ్యులు కలిసి ఉంటేనే మీకు బలం..అందరూ కలిసి కట్టుగా ఉండాలని కోరారు. తన సొంత నియోజకవర్గం కొడంగల్ లో ఆర్యవైశ్య బిడ్డను మున్సిపల్ చైర్మన్ చేశానని చెప్పారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందన్నారు.

# మట్టితో గణపతి.. ప్రకృతితో మమేకం

(మొదటి పేజీ తరువాయి)

**ప్రకృతి సిద్ధమైన పూజా విధానం**
మన ప్రాచీన సంప్రదాయంలో వినాయక చవితికి ఉపయోగించే ప్రతి ఒక్క వస్తువు ప్రకృతితో మమేకమై ఉంటుంది.

**చేసేది మట్టితో:** స్వామివారి ప్రతిమను చెరువులు లేదా నదుల నుంచి తెచ్చిన పవిత్రమైన బంకమట్టితో తయారు చేస్తాం.

**అలంకరించేది ఆకులతో:** ఏకవింశతి (21 రకాల) పత్రులతో వినాయకుడిని అలంకరించి, పూజిస్తాం. ఈ పత్రులలో గరికె, మారేడు, ఉత్తరేణి, జమ్మి వంటి ఎన్నో శ్రేష్ఠమైన మూలికలు ఉంటాయి. ఇవి వర్షాకాలంలో వ్యాపించే క్రిమికీటకాల నుంచి మన ఆరోగ్యాలను కాపాడే ఔషధ గుణాలు కలవి.

**పూజించేది పూలతో:** రంగురంగుల సహజ సిద్ధమైన పూలతో ఆ పార్వతీ తనయుడిని వేడుకుంటాం.

**నిమజ్జనం చేసేది నీటితో:** పూజల అనంతరం మట్టి విగ్రహాన్ని నీటిలోనే నిమజ్జనం చేస్తాం. నీటిలోకరిగిన మట్టి, పత్రుల మూలికా గుణాలు జల వనరులను శుద్ధి చేస్తాయి. ఈ సమగ్ర ప్రక్రియను పరిశీలిస్తే... స్వామివారి రూపం ప్రకృతిలో నుంచి ఉద్భవించి, చివరకు మళ్లీ ఆ ప్రకృతిలోనే లయమవుతుంది. అందుకే "గణపతి అంటే కేవలం ఒక ఆకృతి కాదు... ఆయన సాక్షాత్తూ ప్రకృతి!"



**సనాతన సంస్కృతి - పర్యావరణ పరిరక్షణ**
నేటి నవీన కాలంలో మెరుపులు, ఆడంబరాల కోసం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను, హానికర రసాయన రంగులను ఉపయోగించడం పెరిగిపోయింది. దీనివల్ల మన నదులు, చెరువులు కలుషితమై, జలచరాల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. కానీ, మన పూర్వీకులు అందించిన సనాతన సంప్రదాయం ఎప్పుడూ పర్యావరణానికి హాని తలపెట్టలేదు. ప్రకృతిని దేవుడిగా భావించి ఆరాధించడమే మన భారతీయ సంస్కృతిలోని గొప్పదనం.



**మనమందరం తీసుకోవాల్సిన సంకల్పం**
ఈ వినాయక చవితి వేళ మనమంతా ఒక మంచి నిర్ణయం తీసుకుందాం. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను విడిచి పెట్టి, శుద్ధమైన మట్టి గణపతులను మాత్రమే ఇంట్లో నిలుపుకుందాం. పత్రులతో, పూలతో స్వామిని పూజించి, ప్రకృతిని పరిరక్షించుకుందాం. మన సంస్కృతీ సంప్రదాయాలు తెలిపే ఈ పర్యావరణహిత సందేశాన్ని ప్రతి ఒక్కరికీ చేరవేస్తూ, రాబోయే తరాలకు పరిశుభ్రమైన, పచ్చని సమాజాన్ని కానుకగా అందిద్దాం.

# NH-65 విస్తరణకు ప్రభుత్వం రెడీ

**ముద్ర డెస్క్:**
తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత కీలకమైన రహదారి మార్గాల్లో ఒకటైన హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి–65 (NH-65)కు మహర్దశ పట్టనుంది. తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే ప్రధాన మార్గాన్ని 6 వరుసలుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా భూసేకరణ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. నల్గొండ జిల్లా పరిధిలోని 62.20 కిలోమీటర్ నుంచి 126.800 కిలోమీటర్ వరకు రహదారి విస్తరణకు సంబంధించి కేంద్ర రహదారి, రవాణా శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.

**6.32 హెక్టార్ల భూసేకరణ**
NH-65 విస్తరణలో భాగంగా నల్గొండ జిల్లాలోని చిట్యాల, కట్టంగూర్, నార్కెట్‌పల్లి, నకిరేకల్, కేతేపల్లి మండలాల్లో భూములను సేకరించనున్నారు. ఆయా మండలాల పరిధిలోని వెలిమినేడు, వట్టిమర్తి, చిట్యాల, నార్కెట్‌పల్లి, యల్లారెడ్డిగూడెం, చెరువుగట్టు, పామనగుండ్ల, దుగ్నేవల్లి, అయిటిపాముల, చందంపల్లి, నకిరేకల్, కొర్లపహాడ్, ఇనుపాముల గ్రామాల్లోని 70 సర్వే నంబర్లలో ఉన్న భూములను సేకరించేందుకు చర్యలు చేపట్టారు. మొత్తం 6.32 హెక్టార్ల వ్యవసాయ, వ్యవసాయేతర భూములను తీసుకోనున్నారు.

**21 రోజుల్లో అభ్యంతరాలు**
జాతీయ రహదారుల చట్టం–1956లోని సెక్షన్ 3ఏ(1) కింద కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. భూసేకరణకు సంబంధించి భూయజమానులు లేదా ఇతర సంబంధిత వ్యక్తులకు ఏవైనా అభ్యంతరాలు, సూచనలు, సవరణలు ఉంటే 21 రోజుల్లోగా సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి (RDO) దృష్టికి తీసుకురావాలని ప్రభుత్వం సూచించింది. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తదుపరి ప్రక్రియను పూర్తి చేసి తుది భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

**రద్దీకి చెక్.. ప్రయాణానికి ఊరట**
హైదరాబాద్–విజయవాడ మార్గం రెండు రాష్ట్రాల మధ్య నిత్యం వేలాది వాహనాల రాకపోకలకు ప్రధాన మార్గంగా ఉంది. ముఖ్యంగా సంక్రాంతి, దసరా, దీపావళి, ఇతర పండుగల సమయంలో ఈ రహదారిపై భారీగా ట్రాఫిక్ పెరుగుతోంది. రహదారిని 6 లేన్లుగా విస్తరించడం ద్వారా వాహనాల రాకపోకలు సులభతరం కావడంతో పాటు ప్రయాణ సమయం తగ్గే అవకాశం ఉంది. పారిశ్రామిక, వాణిజ్య రవాణాకు కూడా ఈ విస్తరణ మరింత ఊతమివ్వనుంది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మెరుగైన రహదారి కనెక్టివిటీకి ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.

# ముగిసిన బ్రిక్స్ సదస్సు

**ముద్ర, ఢిల్లీ :**
దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు విజయవంతంగా ముగిసింది. ముగింపు సమావేశంలో ప్రసంగించిన ప్రధాని నరేంద్రమోడీ.. సదస్సుకు హాజరైన 21 దేశాల అధినేతలకు, ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. నెక్స్ట జరగబోయే బ్రిక్స్ సదస్సుకు చైనా ఆతిథ్యం ఇవ్వనుండటంతో.. ఆ దేశ ప్రధానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించి.. సమ్మిళిత అభివృద్ధిని సాధించేందుకు బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర సహకారం అత్యంత కీలకమని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఘర్షణల వల్ల సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆవేదన చెందారు. అలాగే లేటెస్ట్ టెక్నాలజీ, కొన్ని కీలకమైన ఖనిజాలను కొన్నిశక్తులు ఆయుధాలుగా మార్చుకోవడంపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. ఇక బ్రిక్స్ కూటమి మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో.. బ్రిక్స్ కూటమి నుంచి ప్రపంచం ఆలోచనలు, వాగ్దానాలు కాకుండా ఉపయోగపడే ఫలితాలను ఆసిస్తోందని మోదీ స్పష్టం చేశారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 14.09.2026
www.mudranews.in | @mudranews



## వైరల్ జ్వరాలు : తాగునీరు, ఆహారంపై జాగ్రత్త

కలుషిత నీరు, అపరిశుభ్రమైన ఆహారం వల్ల కొన్ని వైరల్ ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుంది. కాచి చల్లార్చిన లేదా సురక్షితమైన నీటిని తాగడంతో పాటు తాజా, పరిశుభ్రమైన ఆహారాన్నే తీసుకోవాలి.



## విఘ్నాలు తొలగి సుఖసంతోషాలు కలగాలి: సీఎం

**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడు ప్రతి ఒక్కరి జీవితంలోని అడ్డంకులను తొలగించి ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం ప్రసాదించాలని సీఎం ప్రార్థించారు. వాడవాడలా ఏర్పాటు చేసే గణేష్ మండపాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని ప్రజలను కోరారు. గణపతి నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్ తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, భక్తుల రద్దీ అధికంగా ఉండే మండపాల వద్ద తగిన జాగ్రత్తలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది కూడా వినాయక మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు సీఎం తెలిపారు.

## 'మోదీ @25' ఫెలోషిప్ ప్రారంభం



**ముద్ర, న్యూఢిల్లీ:** రాంభావు మ్హాల్గీ ప్రబోధిని ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన 'Understanding Transformative Governance | Modi @ 25' ఫెలోషిప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. మోదీ 25 ఏళ్ల పరిపాలనా ప్రస్థానంలో ప్రజా విధానాలు, పారదర్శకత, జవాబుదారీతనం, దేశ నిర్మాణంలో వచ్చిన మార్పులను ఈ సందర్భంగా వివరించారు. DBT వంటి వ్యవస్థలు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను నేరుగా ప్రజలకు చేరుస్తున్నాయని పేర్కొన్నారు. వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనకు పరిపాలనా సంస్కరణలపై లోతైన అధ్యయనం అవసరమని తెలిపారు. ఈ ఫెలోషిప్ దేశ అభివృద్ధికి దోహదపడుతున్న పరిపాలనా మార్పులను అధ్యయనం చేసేందుకు వేదికగా నిలుస్తుందని కార్యక్రమంలో పేర్కొన్నారు.

## ప్రధాని మోదీని సాయం కోరిన చిన్ననాటి స్కూల్ ఫ్రెండ్



**ముద్ర, ఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీని ఆయన చిన్ననాటి స్నేహితుడు అస్గర్‌అలీ వోహ్రా ఇటీవల కలిశారు. భాజపా ఎమ్మెల్యే నరేంద్ర మెహతాకు సంబంధించిన బిల్డర్లు నకిలీ పత్రాలను ఉపయోగించి తన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని ఆయన మోదీతో చెప్పుకొని వాపోయారు. ఎన్నో దశాబ్దాలుగా తన భూమి కోసం పోరాటం చేస్తున్నా.. న్యాయం జరగకపోవడంతో ప్రధానిని ఆశ్రయించినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వోహ్రా గుజరాత్‌లోని వద్నగర్‌లోని బీఎన్ హైస్కూల్ లో చదువుకునే సమయంలోనే మోదీ కూడా అదే పాఠశాలలో విద్యను అభ్యసించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌లోని భయందర్ ఈస్ట్‌లోని నవ్‌ఘర్ రోడ్డులో ఉన్న సుమారు 2,810 చదరపు మీటర్ల భూమిని 1989లో వోహ్రా కొనుగోలు చేశారు. 2011లో కొందరు బిల్డర్లు నకిలీ పత్రాలు తయారు చేసి, తన భూమిని రెండు భాగాలుగా విభజించారు. అందులో ఒక భాగాన్ని బిల్డర్స్ తమ పేరు మీద బదిలీ చేయించుకోగా.. మరో భాగాన్ని సెవెన్ ఎలెవెన్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ పేరుకు చెందినదిగా నకిలీ పత్రాలు సృష్టించారు. ఆ సంస్థకు భాజపా ఎమ్మెల్యే నరేంద్ర మెహతాతో సంబంధం ఉంది.దీంతో ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సైతం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. 2015లో ఎఫ్ఐఆర్ దాఖలు చేసినా దాదాపు 11ఏళ్ల తర్వాత తాజాగా (2026) లో ఈ కేసులో కోర్టుకు నివేదిక సమర్పించిందని అన్నారు. తీరా చూస్తే.. 2025లో నిందితులు తనపై ఎదురు కేసు పెట్టినట్లు తెలిసిందని వాపోయారు. దీంతో మరోదారి లేక తన చిన్ననాటి స్నేహితుడైన మోదీతో తన బాధను తెలియజేయడానికి ప్రధాని నివాసానికి వచ్చినట్లు తెలిపారు. రాజకీయ నేతల బెదిరింపుల వల్లే అధికారులు ఈ విషయంలో చర్యలు తీసుకోవట్లేదని.. దీనిపై సీబీఐతో విచారణ జరిపించి, తనకు న్యాయం చేయాలని వోహ్రా మోదీని కోరారు. మోదీ ఆయనకు న్యాయం జరుగుతుందని ధైర్యం చెప్పారు. ఈ నేపథ్యంలో వోహ్రాకు సంబంధించిన భూవివాదంపై ఈనెల 16న కోర్టులో విచారణ జరగనుందని అధికారులు వెల్లడించారు.

## టిమ్స్‌లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్ ప్రారంభం..



**ముద్ర, హైదరాబాద్:** డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (TIMS)లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్ ప్రారంభమైంది. తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం ఆస్పత్రికి చేరుకుని వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెడికల్ రోబోటిక్ ఎక్విప్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఆయన పరిశీలించారు. వాటి వినియోగంపై నిపుణులను అడిగి తెలుసుకున్నారు. వైద్య రంగంలో రోబోటిక్ సర్జరీ సేవలను మరింత విస్తృతం చేయడం, ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడంపై రాజనర్సింహ చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ వాణి, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, డాక్టర్ బీరప్ప, డాక్టర్ విమల థామస్, డాక్టర్ సుధీర్ శ్రీవాత్సవ పాల్గొన్నారు.

# నీడను వెంటాడి.. ఆయుధాల మిస్టరీ ఛేదించారు!

**బొల్లారం మద్రాస్ రెజిమెంట్ వెపన్స్ చోరీ కేసులో 11 రోజుల ఉత్కంఠభరిత దర్యాప్తు**
**500 సీసీ కెమెరాలు.. సెకన్ టు సెకన్ ఫుటేజ్ స్కానింగ్..**
**చివరకు మాజీ సైనిక ఉద్యోగి మల్లేష్ అరెస్ట్**

**ముద్ర, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బొల్లారం మిలటరీ మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ కేసు దర్యాప్తు ఉత్కంఠభరితంగా సాగింది. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మిలటరీ అధికారులు, రాష్ట్రంలోని వివిధ పోలీసు విభాగాలు, కేంద్ర దర్యాప్తు సంస్థలు సమన్వయంతో చేపట్టిన విచారణ.. సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపించేలా సాగినట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. దాదాపు 11 రోజుల పాటు సాగిన ఈ మిస్టరీ ఛేదన ఇప్పుడు పోలీసు దర్యాప్తు చరిత్రలో ప్రత్యేకంగా నిలిచే కేసుగా మారింది.

**నీడలను కూడా వదల్లేదు!**

కేసు దర్యాప్తులో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్‌ను జల్లెడ పట్టారు. దాదాపు 500 సీసీ కెమెరాలను పరిశీలించారు. ముఖ్యంగా 29, 30వ తేదీ రాత్రులకు సంబంధించిన ఫుటేజ్‌ను సెకన్ టు సెకన్ స్కాన్ చేశారు. రాత్రి సమయంలో లైట్ల వెలుతురులో కనిపించిన అనుమానాస్పద నీడలను కూడా పోలీసులు వదల్లేదు. సీసీ కెమెరాల్లో కనిపించిన సుమారు 20 నుంచి 30 నీడలను అనుమానితులుగా భావించి మ్యాపింగ్ చేసి ఫాలో అయ్యారు. చివరకు అవి మనుషుల నీడలు కావని, ఇతర వస్తువుల వల్ల ఏర్పడిన షాడోస్ అని నిర్ధారించారు.



రెండు రోజులు.. ఒకే ఫుటేజ్!

సీసీ కెమెరా ఫుటేజ్‌ను విశ్లేషించడంలో పోలీసులు అనుసరించిన పద్ధతి దర్యాప్తులో కీలకంగా మారింది. టైమ్ గ్యాప్ మేనేజ్‌మెంట్‌తో వివిధ ప్రాంతాల్లోని ఫుటేజ్‌ను అనుసంధానిస్తూ అనుమానాస్పద కదలికలను మ్యాపింగ్ చేశారు. ఒక రాత్రికి సంబంధించిన ఫుటేజ్‌ను జల్లెడ పట్టేందుకు పోలీసులు వరుసగా రెండు రోజుల పాటు నిరంతరం వీడియోలను పరిశీలించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో లభించిన ప్రాథమిక ఆధారాలను ఒక్కొక్కటిగా క్రాస్‌చెక్ చేస్తూ చివరకు మాజీ సైనిక ఉద్యోగి మల్లేష్పై అనుమానం బలపడింది. అతడి కదలికలను పోలీసులు షాడో చేయడంతో కేసులో కీలకమైన ఆధారాలు లభించాయి. దీంతో ఆయుధాల మిస్సింగ్ మిస్టరీకి తెరపడింది.

**12 తుపాకులు.. 2 వేల బుల్లెట్లు స్వాధీనం**

బొల్లారం మిలటరీ వెపన్స్ మిస్సింగ్ ఘటనపై తొలుత బొల్లారం పోలీసులు చోరీ కేసు నమోదు చేశారు. మల్లేష్ అరెస్టు అనంతరం దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన ఆధారాల ఆధారంగా అతనిపై తాజాగా ఆర్మ్స్ యాక్ట్ కింద కూడా కేసు నమోదు చేశారు. నిందితుడి నుంచి మిస్సైన 12 తుపాకులు, సుమారు 2 వేల బుల్లెట్లు, నైట్ విజన్ బైనాక్యులర్, మ్యాగజైన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, ఇతర సామగ్రిని కోర్టుకు సమర్పించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

**మిస్టరీ ఛేదించినా.. అసలు ప్రశ్నలు ఇంకా!**

ఆయుధాలు ఎక్కడికి తరలించాలనుకున్నారు? ఈ చోరీ వెనుక మల్లేష్ ఒక్కడే ఉన్నాడా? మరెవరైనా సహకరించారా? ఆయుధాల మిస్సింగ్ వెనుక ఏదైనా పెద్ద కుట్ర దాగి ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న మల్లేష్‌ను మరోసారి పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించాలని అధికారులు భావిస్తున్నారు. అతడి నుంచి ఆయుధాల చోరీ వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్, ఉద్దేశం, ఇతరుల ప్రమేయం వంటి కీలక వివరాలను రాబట్టేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.11 రోజుల దర్యాప్తు.. వందల గంటల ఫుటేజ్.. వేల అనుమానాలు.. చివరకు ఒక్క నీడే దారి చూపించింది!

బొల్లారం ఆయుధాల చోరీ కేసులో పోలీసుల సమన్వయం, సాంకేతిక ఆధారాల విశ్లేషణ, సీసీ కెమెరాలపై సాగిన సూక్ష్మ పరిశీలన.. ఈ కేసును అత్యంత ఆసక్తికరమైన దర్యాప్తు ఉదంతంగా మార్చింది.

## ప్రభుత్వంపై సీజేపీ చీఫ్ అభిజీత్ వ్యంగ్యాస్త్రాలు



**ముద్ర, ముంబై న్యూస్ :** మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో శనివారం గిరిజన కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కు ఇన్‌ఫ్లుయెన్సర్ల నుంచి అవహేళనలు ఎదురయ్యాయి. ఆ ఘటనపై దీప్కే స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం పై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కొందరు వ్యక్తులు తనను ముఖ్యమంత్రిగా భావించి, విమర్శించారని అన్నారు. అందుకుగానూ పిల్లల మరణాలకు నైతిక బాధ్యత వహిస్తూ.. మధ్యప్రదేశ్ సీఎంగా రాజీనామా చేస్తున్నా'నంటూ సోషల్ మీడియాలో పోస్ట్‌లో పేర్కొన్నారు. 'నేను తక్షణమే మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నా. రాష్ట్ర ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు ప్రధాని మోదీజీకి ధన్యవాదాలు. అయితే, ఆ బాధ్యతను నిర్వర్తించడంలో నేను పూర్తిగా విఫలమయ్యాను. బాలాఘాట్‌లో 30మందికి పైగా గిరిజన పిల్లల మరణాల తర్వాత, ఈ పదవిలో కొనసాగడానికి నా అంతరాత్మ అంగీకరించట్లేదు''

''బాధిత కుటుంబాలకు రూ.2లక్షల నష్టపరిహారం ఇస్తామని మొదట ప్రకటించాం. పిల్లల మరణాలను ప్రశ్నిస్తూ.. గిరిజన వర్గాలు నిరసన చేపట్టడంతో ఆ పరిహారాన్ని రూ.4లక్షలకు పెంచాము. అదే చనిపోయిన పిల్లలు ఎమ్మెల్యేల పిల్లలై ఉంటే ఇంతే మొత్తాన్ని చెల్లించేవారిమా? చిన్నారుల మరణానికి కారణమైన వైద్యాధికారులపై చర్యలు తీసుకోవడంలోనూ ప్రభుత్వం విఫలమైంది. బాలాఘాట్ గిరిజనులకే కాకుండా రాష్ట్రంలోని గిరిజనులందరికీ నేను అన్యాయం చేశాను. అందువల్లే ఈ పదవిలో కొనసాగే నైతిక హక్కు నాకు ఉందని భావించట్లేదు' అని దీప్కే సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

## తెలంగాణ రక్షణ సేనలోకి నాగోబా ఆలయ ప్రధాన పూజారి

**పలువురు సర్పంచులు, ముఖ్య నాయకులతో కలిసి పార్టీలో చేరిక**
**అక్టోబర్ లో ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ**

**ముద్ర, హైదరాబాద్ :** కేస్లాపూర్ లోని నాగోబా దేవాలయ ప్రధాన పూజారి మేస్రం ఆనంద రావు తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. ఆదివారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో పలువురు సర్పంచులు, ముఖ్య నాయకులతో కలిసి పార్టీలో చేరారు. వారికి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. కల్వకుంట్ల కవిత నాగోబా భక్తురాలు.. ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వెళ్లిన ప్రతిసారి నాగోబా ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ అమ్మవారి ఆశీస్సులు తమపై సంపూర్ణంగా ఉన్నాయని కవిత విశ్వసిస్తారు. ఆలయ ప్రధాన పూజారి, మేస్రం వంశీయుల పెద్ద అయిన మేస్రం ఆనందరావు చేరికతో తమ బలం రెట్టింపు అయ్యిందనే భావనలో ఉన్నారు.

మేస్రం ఆనందరావుతో పాటు గిన్నెర గ్రామ సర్పంచ్ మేస్రం భీమ్ రావు, ముత్తనూరు సర్పంచ్ రిట్టె విఠల్, ఆసోద గ్రామ సర్పంచ్ నగేశ్, మన్నూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు కాట్లె మనోహర్, సీనియర్ నాయకులు మేస్రం దయాకర్, తొడసం సాగర్, మేస్రం జంగురావు, కోట్నాక్ లక్ష్మణ్, సాయిగౌడ్, కోట్నాక్ కృష్ణా తదితరులు టీఆర్ఎస్ లో చేరారు. కార్యక్రమంలో బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, పార్టీ సీనియర్ నాయకులు లోకిని రాజు తదితరులు పాల్గొన్నారు.



అక్టోబర్ లో ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ

అక్టోబర్ నెలలో ఇంద్రవెల్లి కేంద్రంగా భారీ బహిరంగ సభ నిర్వహించేలా తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత వ్యూహరచన చేస్తున్నారు. నిజామాబాద్ లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభ సక్సెస్ తో జోష్ మీద ఉన్న పార్టీ క్యాడర్ లో మరింత ఉత్సాహం నింపేందుకు ఈనెల 20న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో పాంచజన్య సంకల్ప సభ నిర్వహిస్తున్నారు. అక్టోబర్ లో ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ నిర్వహించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల నియోజక వర్గాల పరిధిలోని పార్టీ క్యాడర్ లో జోష్ నింపే ప్రయత్నాల్లో కవిత ఉన్నారు. కొడంగల్ బహిరంగ సభ అనంతరం ఇంద్రవెల్లి సభ నిర్వహించే తేదీని ప్రకటించనున్నారు. ఈ సభ ద్వారా ఆదివాసీలు, ముఖ్యంగా గోండులు, బంజారాలను పెద్ద సంఖ్యలో పార్టీలో చేర్చుకునేలా ప్రణాళికలు రచిస్తున్నారు.

## అంకురార్పణతో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవ ఘట్టాలకు బీజం

**సెప్టెంబర్ 14న రాత్రి 7 నుండి 8 గంటల వరకు సేనాధిపతి ఉత్సవం**

**ముద్ర, తిరుమల :** ఈ ఏడాది శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15వ తేదీ నుండి తిరుమలలో ప్రారంభం కానున్నాయి. వైఖానస ఆగమ సాంప్రదాయం ప్రకారం సెప్టెంబర్ 14వ తేదీ రాత్రి 7గంటల నుండి 8 గంటల మధ్యలో నిర్వహించే అంకురార్పణ ఘట్టంతో ఈ బ్రహ్మోత్సవాలకు బీజం పడనుంది. ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఆగమశాస్త్రం ప్రకారం ప్రతి వైదిక ఉత్సవానికి ముందు అంకురార్పణ చేపడతారు. నవధాన్యాలను మొలకెత్తించి ఈ భూమండలమంతా పాడిపంటలతో, పశుపక్ష్యాదులతో సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తారు.

**సేనాధిపతి ఉత్సవం**

శ్రీవారిసర్వసైన్యాధ్యక్షుడుశ్రీవిష్వక్సేనులవారిని ఈ సందర్భంగా ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు చేపడతారు. జగద్రక్షకుడైన శ్రీవారికి నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు శ్రీ విష్వక్సేనులవారు ఈ విధంగా మాడ వీధుల్లో ఊరేగుతారని ప్రాశస్త్యం.

**మేదినిపూజ**

నవధాన్యాలు మొలకెత్తేందుకు అవసరమైన పుట్టమన్ను కోసం ముందుగా భూదేవిని ప్రసన్నం చేసుకునేందుకు మేదినిపూజ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అర్చకులు భూసూక్తాన్ని పఠిస్తారు.

**అంకురార్పణ**

వైఖానస ఆగమంలోని క్రతువుల్లో అంకురార్పణం లేదా బీజవాపనం అత్యంత ముఖ్యమైనది. ముందుగా పాలికల్లో (మట్టికుండలు) పుట్టమన్ను నింపుతారు. వీటిలో నవగ్రహాలకు సంకేతంగా నవధాన్యాలు పోస్తారు. ఈ విత్తనాలు బాగా




మొలకెత్తాలని కోరుతూ ఓషధీసూక్తాలను పఠిస్తారు. ఇందులో గోధుమలు – సూర్యుడు, బియ్యం – చంద్రుడు, కందులు – కుజుడు, పెసలు – బుధుడు, శనగలు – బృహస్పతి, అలసందలు – శుక్రుడు, నువ్వులు – శని, మినుములు – రాహువు, ఉలవలు – కేతువుకు సంకేతంగా భావిస్తారు. అలాగే యాగశాలలో ఈ పాలికల చుట్టూ అష్టదిక్పాలకులైన ఇంద్రుడు, అగ్ని, యముడు, నిరృతి, వరుణుడు, వాయుదేవుడు, కుబేరుడు, ఈశానతోపాటు మొత్తం 49 మంది దేవతలను ఆవాహన చేస్తారు.

**అక్షతారోపణ**

ఈ పాలికల్లోని నవధాన్యాలను బ్రహ్మోత్సవాల 9 రోజుల పాటు పెంచుతారు. చివరిరోజున ఈ మొలలను వేరుచేసి స్వామివారికి అక్షతారోపణ చేస్తారు. ఈ మొలకలు ఎంత గొప్పగా చిగురిస్తే బ్రహ్మోత్సవాలు అంత ఘనంగా నడుస్తాయి అన్నది భక్తుల విశ్వాసం.

## హైదరాబాద్‌లో డ్రంకెన్ డ్రైవ్.. 292 మందిపై కేసులు

ముద్ర, హైదరాబాద్ : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన వీకెండ్ స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్‌లో ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 292 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిలో 240 మంది బైకర్లు, 12 మంది ఆటో డ్రైవర్లు, 40 మంది కారు డ్రైవర్లు ఉన్నారు. అధిక మోతాదులో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోనున్నారు. 14 మంది వాహనదారులకు 301 నుంచి 550 మధ్య బీఏసీ పాయింట్లు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన 292 మందిని చట్టపరమైన చర్యల్లో భాగంగా కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
సోమవారం 14.09.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు



అంబికాత్మకు ఉద్భవించిన
అక్షరుడు
అమ్మ ఆజ్ఞను పాటించిన
అమరేంద్రుడు
ఆపదలొచ్చినా వెరవని
ధైర్యవంతుడు
అమ్మానాన్నలే నా దైవమన్న
కుమారుడు

పశుపతి ఆక్రోశాన అమరుడైన
బాలుడు
పార్వతి పట్టుతో వెలసిన
గజేంద్రుడు
పావనభరితుడై ముల్లోకాలు
తిరిగిండు
పవిత్ర మనస్సుతో అగ్రజుణ్ణి
గెలిచిండు

శివపార్వతుల శివముల దైవజ్ఞుడు
సకలదేవతల దీవెనలా
ఆరాధికుడు
సూనృతము సూత్రధారుడైన
గణేశుడు
సర్వమానవ విఘ్నం పోగొట్టే
విఘ్నేషుడు

నారాయణ మంత్రంతో నవతేజం
చెంది
నందనుడై తల్లిదండ్రుల దీవెన
పొంది
విశ్వమానవ సేవలో నిత్యపూ
జలంది
ప్రతి ఏటా ప్రతిమతో గొప్ప ప్రేమలు
పొందె

ప్రకృతి ప్రసాదించిన పత్రితో
అభిషేకం
మట్టి గణపతినే పూజిద్దాం
మనమందరం
పర్యావరణ పరిరక్షణ
కాపాడుకుందాం
పాదసేవతో అమ్మానాన్నలను
గౌరవిద్దాం

విశ్వమానవ సేవలో భాగమైన
మీకు విఘ్నేశ్వరుని
దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని
కోరుతూ...

- మీ వాకిటి రామ్ రెడ్డి

## దసరా కానుకగా కేబినెట్ విస్తరణ!

**అసెంబ్లీ సమావేశాల ఆఖరు రోజున 22Aపై చర్చ**
**సందేహాలు నివృత్తి చేస్తూ మంత్రి పొంగులేటి ప్రజెంటేషన్**
**సుదీర్ఘ క్లారిఫికేషన్ ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం**
**అసెంబ్లీ సమావేశాల తర్వాత కేబినెట్ విస్తరణపై క్లారిటీ?**

తెలంగాణ కేబినెట్ విస్తరణకు ముహూర్తం కుదిరిందా? కాస్త అటు ఇటుగా... ఫలా నా టైంలో చేసేద్దామని పార్టీ పెద్దల మధ్య చర్చ జరుగుతోందా? రాజకీయ యుద్ధా నికి వేదిక అవుతున్న అసెంబ్లీ సమావేశాలు మిగిసిన వెంటనే కేబినెట్ విస్తరణపై క్లారిటీ ఇచ్చేస్తారా? ఆశావహులు ఆల్రెడీ ఢిల్లీ విమానాలు ఎక్కేశారన్నది నిజమేనా? ఉంటే గింటే ఎప్పుడు ఉండవచ్చు కేబినెట్ విస్తరణ? దాని గురించి కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతున్న చర్చలేంటి? తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు చివరి అంకానికి చేరుకుంటున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అందరి అటెన్షన్ ఉన్న 22ఏపై ఆఖరు రోజున చర్చించబోతోంది ప్రభుత్వం. ఆ సందర్భంగానే.. అన్ని రకాల వివరాలను బయటపెట్టాలని డిసైడ్ అయినట్టు తెలుస్తోంది. ఆ భూములకు సంబంధించిన అనుమానాలను నివృత్తి చేస్తూ.. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నారు.

అలాగే.. సీఎం రేవంత్ రెడ్డి కూడా సుదీర్ఘంగా క్లారిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ప్రతిపక్షం బీఆర్ఎస్ పదేపదే ఇదే అంశాన్ని ప్రస్తావించిన క్రమంలో.. దానిపై కొంత అటెన్షన్ వచ్చింది. కానీ.. ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షం సభలో లేదు. అయినాసరే.. అపోజిషన్ లేవనెత్తిన అంశాలకు సమాధానం చెప్పడంతో పాటు గట్టిగా టార్గెట్ చేస్తూ వివరాలన్నింటిని బయట పెట్టాలని డిసైడ్ అయ్యిందట ప్రభుత్వం.

అదంతా ఒక ఎత్తయితే.. అసెంబ్లీ సమావేశాలు ముగిశాక క్యాబినెట్ విస్తరణపై క్లారిటీ వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు పార్టీ నాయకులు. అసెంబ్లీ సమావేశాల తర్వాత క్యాబినెట్ విస్తరణపై క్లారిటీ వస్తుందని చాలా మంది కాంగ్రెస్ నేతలు నమ్ముతున్నారు. ఆశావాహులు ఇప్పటికే హస్తిన వెళ్లి ప్రయత్నాలు కూడా చేసుకుంటున్నారట. ప్రభుత్వంలో ఇప్పుడు మూడు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఆ మూడింటిని సీఎం రేవంత్ రెడ్డి ఎప్పుడు భర్తీ చేస్తారా.. అంటూ ఎప్పటికప్పుడు ఎదురు చూస్తున్నారు, రకరకాల చర్చలు జరిగిపోతున్నాయి. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన వెంటనే విస్తరణ ఉంటుందని భావించారు.

అయితే.. ఇప్పుడు అసెంబ్లీ సమావేశాలు ముగింపునకు సమయం దగ్గర పడటంతో అందరి అటెన్షన్ విస్తరణ మీదికి మళ్లుతోంది. ఈక్రమంలోనే.. దసరా లోపు ఆ పని పూర్తి కావచ్చన్న మాటలు వినిపిస్తున్నాయి కాంగ్రెస్ వర్గాల నుంచి. దసరా కానుకగా క్యాబినెట్ విస్తరణ ఉంటుందని ఆశావహులందరికీ ఇండికేషన్స్ వెళ్తున్నాయట. అయితే.. ఆ లోపు సీఎం రేవంత్ రెడ్డి కూడా కొంత కసరత్తు చేయాల్సి ఉంటుంది. సామాజిక సమీకరణలతో పాటు అధిష్టానంతో మరోసారి చర్చించాల్సి ఉంటుంది. ఆ సంగతులు ఎలా ఉన్నా.. మంత్రి పదవిపై హాజరు పెట్టుకున్న నాయకులకు దసరాలోపు గుడ్ న్యూస్ వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. అయితే ప్రస్తుతానికి సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సమావేశాల మీదనే ఫోకస్ చేశారు. అవి గనుక ముగిస్తే.. ఇక దృష్టి మొత్తం కేబినెట్ మీదికే మళ్లుతుందని చెప్పుకుంటున్నారు. అయితే ... దసరాకి, లేదంటే ఆలోపే విస్తరణ ఉండే అవకాశం ఉండవచ్చన్న ప్రచారం మాత్రం కాంగ్రెస్ నేతల్ని ఊరిస్తోంది.

## ప్రపంచ వేదికపై భారత స్వరం

### మోదీ నాయకత్వంపై మద్దతుదారుల విశ్వాసం



నాగేశ్వర రావు బల్లెడ
సీనియర్ జర్నలిస్ట్, హైదరాబాద్

న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సు భారత దేశం అంతర్జాతీయ వ్యవహారాల్లో పోషిస్తున్న పెరుగుతున్న పాత్రను మరోసారి ప్రపంచానికి తెలియజేసింది. విభిన్న రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు కలిగిన బ్రిక్స్ దేశాలను ఒకే వేదికపై సమన్వయం చేయడం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ తన దౌత్య నైపుణ్యాన్ని ప్రదర్శించారని ఆయన మద్దతుదారులు భావిస్తున్నారు.

"Building for Resilience, Innovation, Cooperation and Sustainability" అనే ఇతివృత్తంతో భారతదేశం నిర్వహిస్తున్న ఈ సదస్సు అభివృద్ధి, సాంకేతికత, ఆర్థిక సహకారం, గ్లోబల్ సౌత్ ప్రాతినిధ్యంపై దృష్టి పెట్టింది. భారత అధ్యక్షతలో సాధించిన పురోగతిని న్యూఢిల్లీ డిక్లరేషన్ ప్రశంసించింది.

**రూపాయి అంతర్జాతీయీకరణకు అవకాశాలు**

బ్రిక్స్ దేశాల మధ్య స్థానిక కరెన్సీల్లో వాణిజ్య సెటిల్‌మెంట్లను ప్రోత్సహించడం వల్ల డాలర్ వంటి మూడో దేశపు కరెన్సీలపై ఆధారపడే అవసరం కొంత తగ్గవచ్చు. విదేశీ మారకపు ఖర్చులు, చెల్లింపుల ఆలస్యం, అంతర్జాతీయ ఆర్థిక ఒడిదుడుకుల ప్రభావాన్ని పరిమితం చేయడానికి ఇది సహాయపడగలదు. అయితే ఇది ఒకే బ్రిక్స్ కరెన్సీని ప్రవేశపెట్టడం లేదా అంతర్జాతీయ వ్యాపారమంతా వెంటనే స్థానిక కరెన్సీలకు మార్చడం కాదు. ప్రతి దేశపు ప్రాధాన్యాలను గౌరవిస్తూ, చెల్లింపు–సందేశ వ్యవస్థల అనుసంధానం, స్థానిక కరెన్సీ సెటిల్‌మెంట్ల సాధ్యాసాధ్యాలను బ్రిక్స్ పేమెంట్ టాస్క్‌ఫోర్స్ పరిశీలించనుంది.




**భారత సాంకేతిక నమూనాకు ప్రపంచ గుర్తింపు**

యూపీఐ డిజిటల్ ఐడెంటిటీ, ప్రత్యక్ష ప్రయోజన బదిలీలు వంటి భారత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నమూనాలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఉపయోగకరమైన పరిష్కారాలుగా గుర్తింపు పొందుతున్నాయి. వీటిని అంతర్జాతీయ చెల్లింపు వ్యవస్థలతో అనుసంధానించాలనే భారత ప్రయత్నాన్ని మోదీ మద్దతుదారులు ఆయన 'ఆత్మనిర్భర్ భారత్' దార్శనికతకు విస్తరణగా చూస్తున్నారు. BRICS చెల్లింపు వ్యవస్థల మధ్య అనుసంధానంవిజయవంతమైతే, సరిహద్దులు దాటే లావాదేవీలు వేగంగా, సురక్షితంగా, తక్కువ ఖర్చుతో జరిగే అవకాశం ఉంది. అయినప్పటికీ సైబర్ భద్రత, కరెన్సీ మార్పిడి, నియంత్రణా ప్రమాణాలు, దేశాల మధ్య విశ్వాసం వంటి అంశాల్లో ఇంకా విస్తృతమైన సాంకేతిక చర్చలు అవసరం.

**గ్లోబల్ సౌత్‌కు బలమైన గొంతుక**

ప్రస్తుతం బ్రిక్స్ సభ్యదేశాలు ప్రపంచ జనాభాలో సుమారు 49.5%, ప్రపంచ జీడీపీలో దాదాపు 40%, ప్రపంచ వాణిజ్యంలో సుమారు 26% వాటాను కలిగి ఉన్నాయి. ఈ విస్తృత కూటమిలో ఏకాభిప్రాయం సాధించడం భారత దౌత్య సామర్థ్యానికి పరీక్షగా నిలుస్తోంది. పాశ్చాత్య దేశాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగిస్తూనే రష్యా, చైనా, ఇరాన్, యూఏఈ తదితర విభిన్న దేశాలతో చర్చలు జరపడం భారత బహుముఖ విదేశాంగ విధానాన్ని ప్రతిబింబిస్తోంది. సరిహద్దు విభేదాలు ఉన్నప్పటికీ చైనాతో సంభాషణను కొనసాగించడం, రష్యాతో సంప్రదాయ సంబంధాలను నిలబెట్టడం, అమెరికా–ఐరోపాతో సహకారాన్ని విస్తరించడం మోదీ దౌత్య విధానంలోని ముఖ్య లక్షణాలుగా ఆయన అనుకూల వర్గాలు పేర్కొంటున్నాయి.

**మోదీ నాయకత్వంపై మద్దతుదారుల విశ్వాసానికి కారణాలు**

మోదీ మరియు బీజేపీ మద్దతుదారుల దృష్టిలో రాజకీయ స్థిరత్వం, మౌలిక సదుపాయాల విస్తరణ, డిజిటల్ పాలన, జాతీయ భద్రత, దేశీయ తయారీ, ప్రపంచ వేదికలపై భారత ప్రాధాన్యం పెరగడం ఆయన నాయకత్వానికి ప్రధాన బలాలు. విధానాల్లో కొనసాగింపు ఉంటే భారత్ దీర్ఘకాలిక పెట్టుబడులు, సాంకేతిక ఆవిష్కరణలు, తయారీ, అంతర్జాతీయ భాగస్వామ్యాల్లో మరింత వేగంగా ముందుకు సాగగలదని వారు విశ్వసిస్తున్నారు. న్యూఢిల్లీ బ్రిక్స్ సదస్సు మోదీ నాయకత్వానికి అంతర్జాతీయంగా కనిపించిన ఒక ముఖ్యమైన దౌత్య సందర్భం. భారత దేశం ప్రపంచ నిబంధనలను అనుసరించే దేశం నుంచి వాటి రూపకల్పనలో ప్రభావవంతమైన భాగస్వామిగా ఎదగాలనే లక్ష్యాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. మోదీ మద్దతుదారుల దృష్టిలో, ఈ ప్రయాణాన్ని స్థిరంగా ముందుకు తీసుకెళ్లగల అనుభవం, రాజకీయ సంకల్పం, అంతర్జాతీయ పరిచయాలు ఆయన నాయకత్వంలో ఉన్నాయనే విశ్వాసమే ఆయన కొనసాగింపుపై వారి ఆకాంక్షకు ప్రధాన కారణం.

## మనసే నిజాయితీకి చిరునామా

### సుధా మూర్తి రచనలు (ఇన్ఫోసిస్)

మూడేళ్ళ క్రితం జూన్‌నెలలో ఒక ఉదయం పూట రోజూలాగానే కన్నడ వార్తాపత్రిక చదువుతున్నాను. ఆ రోజే ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షా ఫలితాలు ప్రచురించారు. లోపలి పేజీల్లో కాలాల కొలది రోల్ నంబర్లు నిండిపోయి ఉన్నాయి. ఇంచుమించు మొదటి పేజీ అంతా ర్యాంకులు తెచ్చుకొన్న వారి పేర్లు, ఫోటోలు ఆక్రమించుకొన్నాయి.

ర్యాంకులు సాధించిన వారంటే నాకు మహా అభిమానం. ర్యాంకు ఒకవ్యక్తి తెలివితేటలను మాత్రమే సూచిస్తుందనుకోరాదు. లక్ష్యసాధనకు ఆ విద్యార్థులు ఎంతకష్టపడి చదివారో, ఎంతటి పట్టుదలతో పరిశ్రమించారో కూడా ర్యాంకులు తెలియజేస్తాయి. ఒక ప్రొఫెసర్ కుటుంబంలోపుట్టి పెరిగిన నా నేపథ్యం, టీచర్‌గా నేను పొందిన అనుభవంతో నేనీ విషయాన్ని నమ్మకంగా చెప్పగలను. కష్టపడితే తప్ప ర్యాంకులు రావు.

ఆ దినపత్రికలో ప్రచురించిన ఫోటోలన్నిటిలోకి ఒక బాలుని ఫోటో నన్ను ఆకట్టుకుంది. అతని నుంచి నాదృష్టిని మరల్చలేకపోయాను. అతను బక్కపలుచగా, పాలిపోయినట్లున్నా, అతని కళ్ళలోని మెరుపు ముచ్చట గొలుపుతోంది. అతని గురించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలని పించింది. అతని పేరు హనుమంతప్ప అని, అతనికి 8వ ర్యాంకు వచ్చిందని చదివాను. ఇంతమాత్రమే తెలుసుకోగలిగాను.

మర్నాడు, ఆశ్చర్యంగా అతని ఫోటో మళ్ళీ ఇంటర్వ్యూతోపాటు ప్రచురించారు. అతనొక వ్యవసాయ కూలీ కుమారుడు. తానో పల్లెటూరిలో నివసిస్తున్నానని, తండ్రి రోజుకు కేవలం 40 రూపాయలు సంపాయిస్తాడని, పైగా అయిదుగురు పిల్లలలో తాను పెద్దవాడినని, అందువల్ల పైచదువుకు వెళ్ళలేకపోతున్నట్లు ఇంటర్వ్యూలో హనుమంతప్ప చెప్పాడు. వారి గిరిజన తెగకు చెందినవారు.

ఈ మెరికలాంటి పిల్లవాడి పరిస్థితి నాకు విచారం కలిగించింది. మనలో చాలా మంది ఖర్చుకు వెనుకాడకుండా మనపిల్లల్ని ట్యూషన్లకు, కోచింగ్ క్లాసులకు పంపిస్తాం. రిఫరెన్స్ పుస్తకాలు, గైడ్లుకొని పెడతాం. సాధ్యమైన సదుపాయాలన్నీ సమకూరుస్తాం. అయితే హనుమంతప్ప పరిస్థితి ఎంత



భిన్నంగా ఉందో చూడండి. రామ్‌పురా గ్రామంలో అతని ప్రాథమిక అవసరాలను తీర్చుకోలేని, చదువులో అందరినీ మించిపోయాడు.

పత్రికను అలాగే చేతిలో పట్టుకొని, ఆలోచిస్తుండగా, నా దృష్టి మా ఇంటి ఆవరణలోని మామిడిచెట్టు పై పడింది. చక్కని కొమ్మలు, మంచు బిందువులుపడి మెరుస్తున్న పచ్చని ఆకులు, కొద్దిరోజుల్లో పక్వానికి రానున్న మామిడి కాయలతో ఆ చెట్టు నిండుగా కనిపిస్తోంది. చెట్టుకు ఆవల కుండీలో పెంచుతున్న మొక్కకూడా కనిపిస్తోంది. ఆ మొక్క నాటినప్పుడు ఎంతుందో ఇప్పటికీ దాదాపు అంతేవుంది, ఎదుగూ బొదుగూ లేదు.

అది ప్రశాంతమైన ప్రాతఃకాలం. చల్లని స్వచ్ఛమైన గాలి. అలా ఆలోచిస్తూ కూర్చుండి పోయాను. ప్రెజర్ కుక్కర్ విజిల్ అదేపనిగా మోగుతుంటే అప్పుడు గుర్తొచ్చింది, అర్ధ గంట గడిచిపోయిందని.

ఇంటర్వ్యూలో హనుమంతప్ప పోస్టల్ చిరునామా ఇచ్చారు. ఇక అట్టే ఆలస్యం చేయకుండా పోస్టుకార్డు తీసి అతనికి ఉత్తరం రాశాను. అతన్ని కలుసుకోవాలను కొంటున్నానని తెలియజేస్తూ, బెంగళూరుకు రావడానికి వీలవుతుందేమో తెలపాలని కోరాను. రెండేళ్లు రాశాను. సరిగ్గా అప్పుడే మా నాన్నగారు వ్యాహ్యాళినుంచి తిరిగొచ్చారు. ఆయనెప్పుడూ ఆచరణీయంగా ఆలోచిస్తారు. ఆయనా ఉత్తరం చదివి "ఇంతదూరం రావడానికి అతనికి డబ్బెక్కడ ఉంటుంది. అతనిక్కడికి రావాలని ఉంటే బస్సుఛార్జీలకు, ఒకజత మంచి దుస్తులు కుట్టించుకోడానికి కూడా డబ్బు పంపించు" అన్నారు.

దాంతో అతని ప్రయాణానికి, దుస్తులకు డబ్బిస్తానంటూ మరొక వాక్యం చేర్చాను. నాలుగు రోజుల్లో పోస్టుకార్డు ద్వారానే జవాబు వచ్చింది. అందులో రెండే వాక్యాలున్నాయి. మొదటి వాక్యంలో నా ఉత్తరానికి కృతజ్ఞతలు తెలిపాడు. రెండో వాక్యంలో బెంగళూరుకు వచ్చి కలుసు కోనడానికి అంగీకారం తెలియజేశాడు.

వెంటనే కొంతసొమ్ము పంపుతూ ఆ ఆఫీసు ఎక్కడుందో ఎలారావాలో వివరించాను. చివరికితను మా ఆఫీసుకు వచ్చినప్పుడు దారి తప్పి వచ్చిన లేగలా కంపిస్తున్నాడు. అతను బహుశా మొదటిసారిగా బెంగళూరు వచ్చినట్లున్నాడు. పరిశుభ్రంగా వున్న చొక్కా లాగూ ధరించాడు. పాతబడితీసి దువ్విన జుత్తుతో ఎంతో వినయంగా కనిపించాడు. అతని కళ్ళలో మెరుపు ఇంకా అలాగే వుంది.

అసలు విషయానికి వచ్చాను. "చదువులో నువ్వు సాధించిన విజయం మాకు సంతోషం కలిగించింది. ఇంకా చదువుకోవాలనుకొంటున్నావా? నిన్ను సంతోషంగా స్పాన్సర్ చేస్తాము. నువ్వు ఏ కోర్సులో చేరదలచుకొన్నా, ఎక్కడ చదవాలనుకొన్నాసరే, ఫీజులు మేము భరిస్తాం."

అప్పుడక్కడ నాతోపాటే సీనియర్ కొలీగ్ ఒకరు చిరునవ్వుతో నన్ను వారించారు. "అంత తొందరెందుకు. మీరు చెప్పునదేమిటో అతను అర్థం చేసుకోనివ్వండి. సాయం కాలంలోగా జవాబు చెప్పనిద్దాం" అన్నారు.

ఆ తర్వాత వెళ్ళేముందు హనుమంతప్ప మెల్లిగా అయినా స్థిరంగా ఇలా చెప్పాడు. "మేడమ్, బళ్ళారిలో ఉన్న టీచర్స్ ట్రైనింగ్ కాలేజీలో చదవాలనుకొంటున్నాను. మా వూరికి అదే దగ్గర".

వెంటనే సరేనన్నాను కానీ, అతనికి ఇంకేదైనా కోర్సు చదవాలన్న ఆశ ఉందేమో తెలుసుకోవాలని కాసేపు మాట్లాడాను. అతను ఏ కోర్సు ఎంచుకొన్నా, మేము ఫీజులు చెల్లిస్తామని స్పష్టం చేసే ప్రయత్నంచేశాను. అయితే తన మనసులో ఏముందో, తనకేం కావాలో అతనికి బాగానే తెలుసనిపించింది.

"నీకు నెలనెలా ఎంతసొమ్ము పంపించమంటావు? ఆ కాలేజీలో హాస్టల్ సదుపాయం ఉందా?" అని అడిగాను.

వివరాలు తెలియవంటూ, తెలుసుకొని ఉత్తరం రాస్తానని చెప్పాడు. నెలకు సుమారు 300 రూపాయలు అవసరమవుతాయంటూ, అతను రెండు రోజుల్లో తన చక్కని దస్తూరీలో ఉత్తరం రాశాడు. అతను, అతని మిత్రుడు కలిసి గది అద్దెకు తీసుకొని, సొంతంగా వంటచేసుకొని ఖర్చులు తగ్గించుకోవాలని నిశ్చయించు కొన్నట్లు తెలిపాడు. వచ్చే ఆరునెలల ఖర్చుకోసం రూ. 1800 పంపితే, వెంటనే డ్రాఫ్టు అందిందని కృతజ్ఞతలు తెలుపుతూ ఉత్తరం రాశాడు.

కొంత కాలం గడిచింది. హనుమంతప్పకు వచ్చే ఆరు నెలలకు సొమ్ము పంపాలన్న విషయం ఒక రోజు హఠాత్తుగా గుర్తొచ్చింది. రూ. 1,800 లకు మరొక బ్యాంకు డ్రాఫ్టు పంపించాను.

ఈసారి కూడా అందినట్లు వెంటనే ఉత్తరం రాశాడు. అయితే కవరులో లెక్కతోపాటు కొన్ని కరెన్సీ నోట్లు ఉండడం చూసి ఆశ్చర్యపోయాను. "మేడమ్, వచ్చే ఆరు నెలలకు మీరెంతో దయతో సొమ్ము పంపారు. అయితే గడచిన రెండు నెలలు నేను బళ్ళారిలో లేను. ఒక నెల మాకాలేజీకి సెలవులు, ఆ తర్వాత నెలంతా సమ్మెతో గడచిపోయింది. అందువల్ల ఈ రెండు నెలల్లో మిగిలిన రూ. 300 మీకు పంపుతున్నాను. దయచేసి ఈ సొమ్ము స్వీకరించండి" అని రాశాడు.

నేను నివ్వెరపోయాను. అంతపేదరికంలోనూ ఇంత నిజాయితీయా

నేనేమీ అతని నెలసరి ఖర్చులకు లెక్కలు అడగనని హనుమంతప్పకు తెలుసు. అయినా మిగిలిన డబ్బును తిప్పిపంపాడు. నమ్మలేని నిజం.

నిజాయితీ అన్నది ఏ ప్రత్యేక వర్గానికో సంకేతంకాదు. విద్యతోకానీ, సంపదతోకానీ దానికి సంబంధం లేదని కూడా నాకు అనుభవంతో తెలిసివచ్చింది. అది ఏ యూనివర్సిటీ లోనో బోధిస్తే వచ్చేది కాదు. ఎక్కువ మందిలో అది హృదయం నుంచి సహజంగా పెల్లుబుకుతుంది.

ఈ అమాయక గ్రామీణ బాలుని నిజాయితీకి ఎలా స్పందించాలో నాకు తోచలేదు. భగవంతుడు హనుమంతప్పకు, అతని కుటుంబానికి ఎప్పటికీ శుభం కలిగించాలని ప్రార్థించాను.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 14.09.2026
www.mudranews.in | @mudranews



**వైరల్ జ్వరాలు రాకుండా..**



రోగనిరోధక శక్తిని పెంచుకోండి. పౌష్టికాహారం, తగినంత నిద్ర, క్రమం తప్పకుండా వ్యాయామం ఆరోగ్యకరమైన రోగనిరోధక వ్యవస్థకు సహాయపడతాయి. పండ్లు, కూరగాయలు, ప్రోటీన్ ఉన్న ఆహారాన్ని రోజువారీ డైట్‌లో చేర్చుకోవాలి.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజించాలి

**ముద్ర, కూకట్‌పల్లి :** పర్యావరణాన్ని, మన సంస్కృతిని కాపాడుకోవడానికి ప్రతి పౌరుడు భాద్రపద మాసంలో వచ్చే వినాయక చవితి సందర్భంగా మట్టి గణనాథులను మాత్రమే పూజించాలని టిపిసిసి ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ శ్రీ బండి రమేష్ పిలుపునిచ్చారు.కెపిహెచ్‌బి కాలనీ వసంత నగర్ డివిజన్ పరిధిలోని సర్దార్ పటేల్ నగర్, భగత్ సింగ్ నగర్, వసంత నగర్, మలేషియన్ టౌన్షిప్, గోపాల్ నగర్ మరియు విశ్వాంబరి షీలా పార్క్ కాలనీలలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ బండి



రమేష్ ముఖ్య అతిథిగా హాజరై కాలనీవాసులకు మట్టి విగ్రహాలను అందజేశారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... మట్టి గణనాథులను ఇంట్లోనే స్వచ్ఛమైన నీటిలో నిమజ్జనం చేసి, ఆ మట్టిని మొక్కలకు వేయడం ద్వారా పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా మొక్కలకు మంచి ఎరువుగా ఉపయోగపడుతుందని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ పవిత్రంగా స్వామివారి ప్రతిమలను మంచి నీటిలోనే నిమజ్జనం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సాయిబాబు చౌదరి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కిలారి బాబు, మలేషియన్ టౌన్షిప్ అధ్యక్షులు కాకర్ల సురేష్ చౌదరి, మాజీ కౌన్సిలర్ లక్ష్మయ్య, చావా శ్రీనివాసరావు, కొదప రామారావు, కాజా నవీన్, చిలుకూరి గోవిందరాజు, రామ్ చౌదరి, లెక్చరర్ శ్రీనివాస్, నల్లమోతు ఫణి, శేషారావు, సురేష్, గంటా భీమేశ్వరరావు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్ టి సి ఎంప్లాయిస్ యూనియన్ విజయం ఖాయం

**ముద్ర, కుత్బుల్లాపూర్ :** ఆర్టీసీ కార్మికుల సంక్షేమం ఒక్క ఎంప్లాయిస్ యూనియన్‌తోనే సాధ్యమవుతుందని, రాబోయే ఎన్నికల్లో యూనియన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర అధ్యక్షుడు బాబు పిలుపునిచ్చారు. ఆదివారం జీడిమెట్ల డిపో వద్ద ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బాబు మాట్లాడుతూ... గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కార్మికుల హక్కులు, సమస్యలపై నిరంతరం పోరాడిన ఏకైక సంఘం తమదేనని స్పష్టం చేశారు. గతంలో జరిగిన ఆర్టీసీ కార్మికుల సమ్మెలో ఎంప్లాయిస్ యూనియన్ కీలక పాత్ర పోషించి సమ్మెను విజయవంతం చేసిందని గుర్తుచేశారు. గత కొన్నేళ్లుగా కార్మికుల సమస్యలపై నోరు విప్పని కొన్ని సంఘాలు..



నేడు ఎన్నికలు రాగానే మాయమాటలు, అబద్ధాలతో కార్మికులను మోసం చేయడానికి వస్తున్నాయని విమర్శించారు. ఈ విషయాలను గ్రహించిన కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరుతున్నారని, జీడిమెట్ల డిపోలో కూడా యూనియన్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిపో గౌరవ అధ్యక్షుడు ఉమామహేష్, రీజినల్ నాయకుడు నగేష్ పటేల్, వైస్ రెడ్డి, జోనల్ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ... ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని అన్నారు. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసేంత వరకు కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటానికి సిపిఐ , ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.డిపో సెక్రటరీ డేనియల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా గౌరవ అధ్యక్షుడు ప్రవీణ్ విప్లవ గీతాలాలపించి కార్మికులలో స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు పాషా, నాయకులు అశోక్, నారాయణ, ఖయ్యూమ్, రాజేష్, భాస్కర్లతో పాటు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కూకట్‌పల్లిలో వైభవంగా ఓనం వేడుకలు

**ముద్ర, కూకట్‌పల్లి :**కూకట్‌పల్లిలోని నవోదయ మలయాళీస్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓనం పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమ ప్రాంగణాన్ని వివిధ రకాల రంగురంగుల పూల పూకళంతో అద్భుతంగా అలంకరించి, సాంప్రదాయ కేరళ పండుగ వాతావరణం ఉట్టిపడేలా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం ముఖ్య అతిథి వడ్డేపల్లి రాజేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓనం పండుగ కేరళ సంస్కృతి, సంప్రదాయాలకు, సోదర భావానికి మరియు ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. "భిన్న ప్రాంతాలు, భాషలు, సంస్కృతులకు చెందిన ప్రజలందరూ పరస్పర గౌరవం, ఆత్మీయతతో కలిసిమెలిసి ఉండటమే భారతీయ సంస్కృతికి ఉన్న గొప్పతనం" అని ఆయన వ్యాఖ్యానించారు.ఓనం వేడుకలను ఎంతో సంప్రదాయబద్ధంగా, కంటికి విందుగా నిర్వహించిన నవోదయ మలయాళీస్ కల్చరల్ అసోసియేషన్ నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం నిర్వాహకులు ముఖ్య అతిథి వడ్డేపల్లి రాజేశ్వరరావును పుష్పగుచ్ఛంతో పాటు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ వేడుకల్లో అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళలు, యువత మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఎంతో ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు.



## శ్రీ నందీశ్వర నారికేళ వినాయకుడిగా పుష్కరఘాట్ వినాయకుడు



**రాజమహేంద్రవరంలోని పుష్కరఘాట్‌లో కొలువుదీరిన వినాయకుడిని "శ్రీ నంలదీశ్వర నారికేళ వినాయకుడు" గా నామకరణం చేశారు. భక్తులను ఆకట్టుకునేలా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు.** – ముద్ర, రాజమహేంద్రవరం

# నాలా విస్తరణ పనుల పరిశీలన



**ముద్ర, శేరిలింగంపల్లి :** చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తి శ్రీ నగర్ కాలనీ లో జరుతున్న పటేల్ చెరువు అలుగు నుండి గంగారం చెరువు వరకు నాల విస్తరణ పనులలో భాగంగా రూ.18 కోట్ల 92 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న బాక్స్ డ్రైన్ నిర్మాణం పనులను బెడ్, సైడ్ వాల్స్ నిర్మాణం మరియు నాల విస్తరణ నిర్మాణం పనులను తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మరియు సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి పరిశీలించిన పీయేసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ఫేస్ 2 లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.79 కోట్ల 58 లక్షల రూపాయలతో అంచనా వ్యయం తో నాల విస్తరణ పనులు చేపట్టడంతో ఎన్నో ఏండ్ల వరద ముంపు సమస్య కు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దానిలో భాగంగా రూ.18 కోట్ల 92 లక్షల రూపాయలతో పటేల్ చెరువు అలుగు నుండి గంగారం చెరువు వరకు నూతనంగా చేపట్టబోయే నాల విస్తరణ పనులను వేగంగా చేయాలని,పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలన్నారు. ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తీరనుంది అని, నాలా విస్తరణ పనులకు అందరూ సహకరించాలని, ఒక్కప్పుడు వరదలు వస్తే కంటి మీద కునుకు లేకుండా ప్రజలు తీవ్ర ఆందోళన తో ఇబ్బందులకు గురయ్యేవారు అని గుర్తు చేశారు. నేడు సమస్య మళ్ళీ పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగినది అని, నాలల విస్తరణ పనులతో లోతట్టు, ముంపు ప్రాంతాలకు ఉపశమనం లభించింది అని ప్రజా అవసరాల దృష్ట్యా ప్రథమ ప్రాధాన్యత లో విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించామన్నారు.నాలల విస్తరణ పనులలో వేగం పెంచాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన నాలా విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులకు చైర్మన్ గాంధీ సూచించారు.నాలల విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, నాలల విస్తరణ పనులు సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని, ప్రధాన రహదారుల పై పనులు జరుగుతున్న సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని , నాలల నిర్మాణం సమయంలో నీటి ప్రవాహం సాఫీగా సాగేలా లెవల్స్ ను నిర్ధారించుకొని పనులు చేపట్టాలని, వర్షాకాలం ను దృష్టిలో పెట్టుకొని పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# కోదాడలో సెప్టెంబర్ 19న మెగా జాబ్ మేళా

**ముద్ర, కోదాడ:** కోదాడలో సెప్టెంబర్ 19న నిర్వహించనున్న మెగా జాబ్ మేళాలో సుమారు 300 కంపెనీలు పాల్గొననున్నాయని, మూడు నుంచి నాలుగు వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం కోదాడలో జాబ్ మేళా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.300 కంపెనీలు సుమారు 27 వేల ఉద్యోగ ఖాళీలతో కోదాడకు వస్తున్నాయని, కనీసం 15 శాతం ఉద్యోగాలు భర్తీ అయినా 3–4 వేల మంది యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. అభ్యర్థులు ముందుగానే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, బయోడేటా ఐదు ప్రతులతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.హుజూర్‌నగర్‌లో గతంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు వచ్చిన



స్పందనను దృష్టిలో పెట్టుకుని కోదాడలో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రద్దీని నివారించేందుకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమానికి శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు హాజరుకానున్నట్లు మంత్రి తెలిపారు.కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతీ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిర్వహణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి యువతీ యువకుడు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

## మణికొండలో 2,000 మట్టి వినాయకుల పంపిణీ



**ముద్ర, మణికొండ:** వినాయక చవితిని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ (మీడియా & కమ్యూనికేషన్స్) వాసిరెడ్డి నరేష్ ఆధ్వర్యంలో మణికొండ డివిజన్‌లోని పలు కాలనీల్లో 2,000 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.తనీషా నగర్ (హుడా), ఎంప్లాయిస్, శ్రీ భాగ్యలక్ష్మి , నేమలి నగర్, శివపురి, చిత్రపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వాసిరెడ్డి నరేష్ మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా నీటి కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. పర్యావరణహితంగా వినాయక చవితిని జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు."మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

## పర్యావరణహితంగా మట్టి వినాయక విగ్రహాలను పూజించాలి



**మండపాల వద్ద జాగ్రత్తగా ఉండాలి**
**ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు**
**రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్, సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జి గద్వాల్ విజయలక్ష్మి**

**ముద్ర, హైదరాబాద్:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్, సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్ శ్రీమతి గద్వాల్ విజయలక్ష్మి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.విఘ్నాలను తొలగించి, ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు, శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆమె ఆకాంక్షించారు.వినాయక చవితిని ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆమె కోరారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి, పండుగను పర్యావరణహితంగా నిర్వహించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గణేష్ మండపాల వద్ద భక్తులు జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచించారు.గణనాథుని ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఐకమత్యంతో జీవించాలని శ్రీమతి గద్వాల్ విజయలక్ష్మి ఆకాంక్షించారు.

## ఈ వారంలోనే ఇందిరమ్మ టవర్స్ ఎల్ఐజీ ఇళ్ల కేటాయింపు పత్రాలు

**ముద్ర, హైదరాబాద్:** ఇందిరమ్మ టవర్స్ LIG గృహాల లక్కీ డ్రాలో ఎంపికైన లబ్ధిదారులకు ఈ వారంలోనే కేటాయింపు పత్రాలు జారీ చేయనున్నట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి. గౌతమ్ తెలిపారు.లక్కీ డ్రాలో మొత్తం 7,340 మంది ఎంపిక కాగా, ఇప్పటివరకు 6,643 మంది క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిందన్నారు. ఇందులో 5,521 మంది అర్హులుగా నిర్ధారణ అయ్యారని తెలిపారు. మిగిలిన వారి పరిశీలనను కూడా ఈ వారంలో పూర్తి చేస్తామని చెప్పారు.ఇళ్ల కేటాయింపు ప్రక్రియలో బ్రోకర్లు, మధ్యవర్తులకు ఎలాంటి పాత్ర లేదని గౌతమ్ స్పష్టం చేశారు. ఇల్లు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తులను నమ్మి లంచం, కమీషన్ లేదా ఇతర రూపాల్లో డబ్బులు చెల్లించవద్దని లబ్ధిదారులను హెచ్చరించారు.మొదటి విడత చెల్లింపునకు సంబంధించిన మొత్తం, బ్యాంకు ఖాతా వివరాలు, గడువు తదితర సమాచారాన్ని కేటాయింపు పత్రాల్లోనే అధికారికంగా తెలియజేస్తామని తెలిపారు. ఇతరులు సూచించే వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ చేయవద్దని సూచించారు.ఇల్లు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే హౌసింగ్ బోర్డు అధికారులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని గౌతమ్ కోరారు.

## ఘనంగా ఆర్. కృష్ణయ్య జన్మదిన వేడుకలు



**ముద్ర, చేవెళ్ల:** హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం చేవెళ్ల నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బండమీది వెంకటేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు నగరానికి తరలి వెళ్లి ఆర్. కృష్ణయ్యకు చేవెళ్ల నియోజకవర్గం బీసీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలు, శాలువా లతో సత్కరించారు. భవిష్యత్ లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి సేవలు అందించాలని ఆకాంక్షంచారు. భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకున్నారు.బీసీ వర్గాల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఆర్. కృష్ణయ్య సాగిస్తున్న సుదీర్ఘ పోరాటాన్ని బండమీది వెంకటేష్ కొనియాడారు. బీసీల హక్కుల సాధన కోసం ఆయన దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ఉద్యమాలు వెనుకబడిన వర్గాల్లో చైతన్యాన్ని పెంపొందించాయని పేర్కొన్నారు. బీసీల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన పోషిస్తున్న పాత్ర కీలకమన్నారు.బీసీ సమాజం ఎదుర్కొంటున్న వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా సంఘటిత పోరాటం మరింత ఉధృతం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. బీసీలకు రాజ్యాంగబద్ధ హక్కులు, జనాభా ప్రాతిపదికన సముచిత ప్రాతినిధ్యం, విద్యా–ఉద్యోగ రంగాల్లో సమాన అవకాశాలు దక్కే వరకు ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నవాబ్ పేట్ మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు విజయ్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు లింగం ముదిరాజ్, శంకర్‌పల్లి మండల బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చీర సాయి, నవాపేట్ మండల ఉపాధ్యక్షులు గొల్ల వెంకటేశం పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 14.09.2026
www.mudranews.in | @mudranews



## జ్వరం ఉన్నవారితో సన్నిహితంగా ఉండొద్దు

ఇంట్లో లేదా చుట్టుపక్కల ఎవరికైనా జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఉంటే అవసరమైన దూరం పాటించాలి. వ్యక్తిగత వస్తువులు పంచుకోకుండా, చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా వైరస్ వ్యాప్తి ప్రమాదాన్ని తగ్గించవచ్చు.



## మట్టి వినాయకుల పంపిణీ



**ముద్ర, కరీంనగర్** : మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినాదంతో ఓ స్వచ్ఛంద సంస్థ నగరవాసులకు మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేశారు. నగరంలో పెద్ద ఎత్తున ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన వినాయకులను ఉపయోగించి నీటిని కలుషితం చేస్తున్నారని అలాకాకుండా అందరూ మట్టి వినాయకులను పూజించి నిమజ్జనం చేసినట్లయితే నీటిలోనే జలచరాలను రక్షించిన వాళ్లమవుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో వేల సంఖ్యలో మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేశారు.

## పిడుగుపాటుతో నలుగురు మృతిపై సీఎం చంద్రబాబు విచారం

**ముద్ర, అమరావతి** :- పిడుగుపాటుకు గురై పల్నాడు జిల్లాలో నలుగురు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం, మోపిరివారిపాలెం, కాకాని శివారు లక్ష్మీపురం, పాలపాడు గ్రామాలకు చెందిన తలపనేని నాగమ్మ, మజ్జిగ చిన్న కోటేశ్వరరావు, మేకల వెంకాయమ్మ, దేరంగుల వెంకటయ్య అనే నలుగురు పిడుగులు పడి మృతిచెండడం బాధాకరమన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన సీఎం... బాధిత కుటుంబాలకు తన ప్రగాఢసానుభూతి ప్రకటించారు. పండుగపూట నాలుగు కుటుంబాల్లో విషాధం నెలకొనడం బాధాకరమని అన్నారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు: చంద్రబాబు




**ముద్ర, హైదరాబాద్**: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు ఏపీ సీఎం చంద్రబాబు.. విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించే ఈ పండుగను ఊళ్లు, కాలనీలు, పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు వాడవాడలా ఘనంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వినాయక చవితి అన్ని వర్గాల ప్రజలను ఒక్కచోటకు చేర్చి ఐక్యతను చాటే గొప్ప సామాజిక పండుగ అని సీఎం చంద్రబాబు తెలిపారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని సూచించారు. పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ మన సంస్కృతి, సంప్రదాయాలను మరింత వైభవంగా కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా గణనాథుడు ఆశీర్వదించాలని కోరుకున్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆనందోత్సాహాలతో వినాయక చవితి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## తెలంగాణలో కుండపోత..

**మహబూబాబాద్‌లో అత్యధికంగా 191 మిమీ వర్షపాతం**
**మంచిర్యాల, యాదాద్రి జిల్లాల్లోనూ భారీ వర్షాలు**
**వరంగల్, నల్గొండలో పొంగిపొర్లుతున్న వాగులు**
**హైదరాబాద్-విజయవాడ మార్గంలో వాహనదారులకు అలర్ట్**



**ముద్ర, హైదరాబాద్** : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (TGDPS) అందించిన అధికారిక గణాంకాల ప్రకారం, శనివారం ఉదయం 08:30 గంటల నుండి ఆదివారం ఉదయం 06:00 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో తీవ్రస్థాయిలో వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా మహబూబాబాద్, మంచిర్యాల, యాదాద్రి భువనగిరి, వరంగల్ , నల్గొండ జిల్లాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.

**మహబూబాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షపాతం**

రాష్ట్రంలోనే అత్యధికంగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో 191.0 మిమీ (19.1 సెంటీమీటర్లు) వర్షపాతం నమోదైంది. అదే జిల్లాలోని నెల్లికుదురులో 151.5 మిమీ, నర్సింహులపేట (కొమ్ములవంచ)లో 140.0 మిమీ, మునిగలవీడులో 119.8 మిమీ , అమ్మనగల్‌లో 110.5 మిమీ చొప్పున భారీ వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో కూడా 149.0 మిమీ తీవ్ర వర్షపాతం రికార్డయింది. ఉమ్మడి మహబూబాబాద్ పరిసర ప్రాంతాల్లో కురిసిన ఈ కుండపోత వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

**యాదాద్రి భువనగిరి, వరంగల్ , ఇతర జిల్లాల్లో తీవ్రత**

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ (దత్తప్పగూడ)లో 142.3 మిమీ, రామాన్నపేటలో 127.5 మిమీ, చౌటుప్పల్‌లో 120.5 మిమీ వర్షపాతం నమోదైంది. వరంగల్ జిల్లా రాయపర్తిలో 128.8 మిమీ, వర్ధన్నపేటలో 123.5 మిమీ, పర్వతగిరి (కల్లెడ)లో 105.5 మిమీ వర్షం పడగా, జనగామ జిల్లా కొడకండ్లలో 126.3 మిమీ, దేవురుప్పులలో 115.3 మిమీ వర్షం రికార్డైంది. నల్గొండ జిల్లా శాలిగౌరారంలో 125.0 మిమీ వర్షపాతం రికార్డు కాగా, సూర్యాపేట జిల్లా అర్వపల్లి, నాగారంతో పాటు కుమురం భీమ్ జిల్లా వంకులం ప్రాంతాల్లోనూ 100 మిమీ దాటి వర్షపాతం నమోదైంది.

**ప్రయాణికులు, లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు**

భారీ వర్షాల కారణంగా రోడ్లపైకి నీరు చేరడం, జాతీయ రహదారులపై దృశ్యమానత (Visibility) తగ్గడంతో ముఖ్యంగా హైదరాబాద్ – విజయవాడ మార్గంలోని చౌటుప్పల్, చిట్యాల పరిసర ప్రాంతాల్లో వెళ్లే వాహనదారులు తీవ్ర అప్రమత్తత పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ , ఖమ్మం జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను స్థానిక యంత్రాంగం అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలు చేపట్టింది.

## నేటి నుండి మహాశక్తి ఆలయంలో వైభవంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు

**విఘ్నేశుని వెలుగుల్లో... కరీంనగరం భక్తి పరవశం**
**శ్రీ మహాశక్తి ఆలయంలో 16 ఏళ్లుగా వైభవంగా కొనసాతున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలు**
**తొమ్మిది రోజుల పాటు విశిష్టమైన సహస్ర మోదక గణపతి హోమం**
**ప్రతిరోజూ ఉదయం–సాయంత్రం ప్రత్యేక పూజలు...**
**భక్తులతో కళకళలాడనున్న ఆలయ ప్రాంగణం**
**23న ఘనంగా గణేష్ నిమజ్జనం...**
**ప్రత్యేక హోమంలో పాల్గొననున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**




**ముద్ర, కరీంనగర్ :** విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆరాధనతో కరీంనగర్ నగరం భక్తి పారవశ్యంలో మునిగిపోనుంది. గణనాథుడి నామస్మరణలు, మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజలు, హోమాల మధ్య కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి ఆలయం గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతోంది. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి ఆశీస్సులతో గత 16 ఏళ్లుగా ఈ ఆలయంలో శ్రీ మహాశక్తి ఆలయంలో అత్యంత వైభవంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈసారి కూడా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

భక్తుల పాలిట కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే దైవంగా భావించే గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. రేపటి నుండి(సోమవారం) ఈ నెల 22వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు నిత్య పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో మారుమోగే మంత్రోచ్చారణలు, సాయంత్రం జరిగే ప్రత్యేక పూజలతో భక్తిమయ వాతావరణం నెలకొననుంది.

**తొమ్మిది రోజుల పాటు సహస్ర మోదక గణపతి హోమం**

గణేశ్ నవరాత్రుల సందర్భంగా ఈసారి ప్రత్యేకంగా 9 రోజుల పాటు సహస్ర మోదక గణపతి హోమం నిర్వహించనున్నారు. వినాయకుడికి అత్యంత ప్రీతికరమైన మోదకాలను సమర్పిస్తూ జరిగే ఈ హోమం భక్తులను విశేషంగా ఆకట్టుకోనుంది. కుటుంబ సౌఖ్యం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు కలగాలని కోరుతూ భక్తులు ఈ ప్రత్యేక హోమంలో పాల్గొననున్నారు.

ప్రతిరోజు ఉదయం 9 గంటలకు గణపతి పూజ, హోమం, సాయంత్రం 6.30 గంటలకు గణపతి నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం జరిగే పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందే అవకాశం ఉంది. తొమ్మిది రోజుల పాటు ఆలయ పరిసరాలు భక్తుల సందడితో కళకళలాడనున్నాయి.

**16 ఏళ్ల సంప్రదాయం... భక్తితో కొనసాగుతున్న వేడుకలు**

శ్రీ మహాశక్తి ఆలయంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక స్థానం ఉంది. గత 16 ఏళ్లుగా ఏటా ఈ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది గణేశ్ ఉత్సవాల కోసం ఎదురుచూసే భక్తులకు ఈ వేడుకలు ఒక ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు, మహిళల నుంచి యువత వరకు అన్ని వర్గాల ప్రజలు గణనాథుడి పూజల్లో పాల్గొనడం ఈ ఉత్సవాల ప్రత్యేకత. ఒకవైపు భక్తి, మరోవైపు సంప్రదాయం... ఇంకోవైపు సామూహిక ఆధ్యాత్మిక వాతావరణం కలిసి శ్రీ మహాశక్తి ఆలయంలో గణేశ్ నవరాత్రులను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి.

**23న గణేష్ నిమజ్జనం**

తొమ్మిది రోజుల భక్తి సంబరాల అనంతరం ఈ నెల 23న గణేష్ నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నారు. నవరాత్రుల చివరి రోజు గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు ఉదయం 8 గంటలకు సహస్రమోదక గణపతి హోమం, పూర్ణాహుతి, ఉత్తర పూజ కార్యక్రమాల అనంతరం నిమజ్జనం చేయనున్నారు మధ్యాహ్నం నిర్వహించే ప్రత్యేక హోమ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విఘ్నాలను తొలగించి, భక్తుల జీవితాల్లో సుఖసంతోషాలను నింపే వినాయకుడి ఆశీస్సుల కోసం కరీంనగర్ ప్రజలు శ్రీ మహాశక్తి ఆలయం వైపు బారులు తీరనున్నారు. "గణపతి బప్పా మోరియా" నినాదాల మధ్య, మంత్రోచ్చారణల నడుమ తొమ్మిది రోజుల పాటు కరీంనగర్‌లో భక్తి పరిమళాలు వెదజల్లనున్నాయి. శ్రీ మహాశక్తి దేవాలయంలో నిర్వహించే గణేశ్ నవరాత్రుల ఉత్సవాలకు హిందూ బంధువులందరూ పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## విలువలు బతికితేనే బంధాలు బలపడతాయి

**ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పొన్నం కుటుంబం ఆదర్శం**
**వ్యవసాయం, రైతుకు విలువ ఇవ్వడంలో పొన్నం సత్తయ్య స్ఫూర్తిదాయకం**
**కొత్త తరానికి కుటుంబ విలువలు అందించాలి: శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**




తండ్రి కష్టం.. పిల్లల విజయాలుగా

**ముద్ర, కరీంనగర్** : ఆస్తులు తరాలకు అందుతాయి.. కానీ విలువలు తరాలను కలుపుతాయి. కుటుంబ బంధాలు క్రమంగా బలహీనపడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేమ, ఆప్యాయత, పరస్పర సహకారంతో ముగ్గురు అన్నదమ్ములు ఐక్యంగా కొనసాగుతున్న పొన్నం కుటుంబం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని పలువురు వక్తలు కొనియాడారు. వ్యవసాయం, రైతు సంక్షేమం, మానవ సంబంధాలు, కుటుంబ విలువలకు జీవితాంతం ప్రాధాన్యత ఇచ్చిన పొన్నం సత్తయ్య గౌడ్ ఆశయాలను ఆయన కుటుంబ సభ్యులు కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. పొన్నం సత్తయ్య గౌడ్ 16వ వర్ధంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జీవన సాఫల్య పురస్కారాల కార్యక్రమం విలువలకు వేదికగా మారింది.

**వ్యవసాయమే గ్రామీణ జీవనానికి ఆధారం**

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ సమాజంలో వ్యవసాయానికి, రైతుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. వ్యవసాయానికి విలువనిస్తూ రైతు జీవితాన్ని గౌరవించిన వ్యక్తిగా పొన్నం సత్తయ్య నిలిచారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు బలంగా ఉండేవని, కుటుంబంలో ఎవరికైనా కష్టం వస్తే మరొకరు అండగా నిలిచేవారని గుర్తుచేశారు. పెద్దలు తమ అనుభవాలను చిన్నవారికి పంచుకోవడం, చిన్నవారు తమ సమస్యలను పెద్దలతో చెప్పుకోవడం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ గొప్పతనమన్నారు.

**బంధాలు బలహీనమైతే.. సమాజంపైనా ప్రభావం**

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతుండటంతో కుటుంబ బంధాలు బలహీనపడుతున్నాయని, దాని ప్రభావం సమాజంపైనా పడుతోందన్నారు. ఒంటరితనం, అసంతృప్తి, కుటుంబ సమస్యలు పెరుగుతున్న పరిస్థితుల్లో మానవ సంబంధాలు, కుటుంబ విలువలను కొత్త తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. పొన్నం సత్తయ్య జీవితం కుటుంబ విలువలు, మానవత్వం, వ్యవసాయం పట్ల నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు.

**పొన్నం కుటుంబం.. విలువలకు ప్రతిరూపం**

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పొన్నం కుటుంబంతో తనకు ఆత్మీయ అనుబంధం ఉందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఎప్పుడూ ప్రేమ, ఆప్యాయతలతో అందరినీ పలకరిస్తూ ఉంటారని, కాంగ్రెస్‌లోని ప్రతి కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులను సోదరభావంతో కలుపుకుపోయే నాయకుడిగా ఉన్నారని చెప్పారు. పొన్నం సత్తయ్య చూపిన మార్గం, కుటుంబ విలువలు నేటికీ కుటుంబంలో కొనసాగుతున్నాయని, ముగ్గురు అన్నదమ్ములు ఐక్యంగా, ప్రేమగా ఉండటం ఎంతో సంతోషాన్ని కలిగించే విషయమన్నారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు, పరస్పర సహకారం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని, తండ్రి ఆశయాలను కుటుంబ సభ్యులు ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. పొన్నం ప్రభాకర్ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలతో పాటు పేదలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని, సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్య, శిక్షణ, అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఉన్నత చదువులు, విదేశీ విద్యకు పేద, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలకు మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. పేదలు, బలహీన వర్గాల కోసం చేస్తున్న సేవల వల్ల ప్రభాకర్‌కు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోందని, ప్రజల పట్ల ఉన్న ప్రేమ, సేవాభావమే అందుకు కారణమన్నారు.

**'జై తెలంగాణ' నినాదం నుంచి మంత్రి స్థాయికి**

మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో పొన్నం ప్రభాకర్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. యువజన కాంగ్రెస్‌లో పోరాట స్ఫూర్తిని నింపి, ఎక్కడ ఉద్యమం జరిగినా ముందుండేవారని తెలిపారు. పార్లమెంట్‌లోనూ బలంగా 'జై తెలంగాణ' నినాదాన్ని వినిపించారని అన్నారు. ఆ పోరాట స్ఫూర్తి, ప్రజల పట్ల నిబద్ధతలో పొన్నం సత్తయ్య విలువల ప్రభావం కనిపిస్తోందన్నారు.

**రైతు గౌరవమే నాకు దక్కిన గౌరవం**

వ్యవసాయ పురస్కార గ్రహీత, వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి మాట్లాడుతూ తనకు దక్కిన పురస్కారం వ్యక్తిగత గౌరవం కాదని, తెలంగాణ రైతులకు దక్కిన గౌరవమన్నారు. తాను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానని, చిన్ననాటి నుంచే వ్యవసాయంతో అనుబంధం ఉందన్నారు. రైతుల అప్పులు, ప్రకృతి వైపరీత్యాలు, కౌలు రైతులు, చిన్న రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ప్రస్తావించారు. రైతులు సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఉందని, రైతు సంఘాలు, ఎఫ్‌పీవోల ద్వారా తమ హక్కులను కాపాడుకోవాలని సూచించారు.

**ఐదో ఏడాది నుంచి వ్యవసాయానికీ పురస్కారం**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తండ్రి పొన్నం సత్తయ్య జ్ఞాపకార్థం ప్రతి ఏడాది వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారిని గుర్తించి సత్కరిస్తున్నామని తెలిపారు. గత ఏడాది వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనతో ఈ ఏడాది నుంచి వ్యవసాయ రంగాన్ని కూడా పురస్కారాల్లో చేర్చామని చెప్పారు. వ్యవసాయ రంగంలో రైతుల సమస్యల కోసం, వ్యవసాయ అభివృద్ధి కోసం పోరాడుతున్న ఎం. కోదండరెడ్డిని ఎంపిక చేసినట్లు తెలిపారు. సాహిత్య రంగంలో వెలిచాల కొండల్‌రావు, జానపద కళారంగంలో గొట్టె కనకవ్వలను సత్కరించారు. ఒక్కొక్కరికి జ్ఞాపికతో పాటు రూ.50 వేల నగదు పురస్కారాన్ని అందించారు.

**తల్లిదండ్రులు ఇచ్చేది ఆస్తి కాదు.. విలువలు**

తల్లిదండ్రులు పెద్దగా చదువుకోకపోయినా తమకు విద్య, క్రమశిక్షణ, విలువలు, సామాజిక బాధ్యతలను నేర్పించారని పొన్నం ప్రభాకర్ అన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తమకు వ్యవసాయం విలువ, రైతు కష్టం తెలుసునని పేర్కొన్నారు. తండ్రి పేరుతో కార్యక్రమాన్ని కొనసాగించడం ద్వారా ఆయన ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించాలన్నదే తమ ఉద్దేశమన్నారు.

**తండ్రి కష్టం.. పిల్లల విజయాలుగా**

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ పొన్నం సత్తయ్య తన జీవితాన్ని వ్యవసాయంతో పాటు పిల్లల భవిష్యత్తు కోసం అంకితం చేశారని అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయ పనులు చేస్తూనే పిల్లలను ఉన్నతంగా చదివించాలనే దూరదృష్టితో వ్యవహరించారని తెలిపారు. ఆయన ముగ్గురు కుమారులు వివిధ రంగాల్లో రాణించడం తండ్రి కష్టం, విలువలకు ప్రతిఫలమన్నారు.

**ఆస్తులకంటే విలువలే గొప్ప వారసత్వం**

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు ఇచ్చే గొప్ప వారసత్వం ఆస్తులు కాదని, మంచి ఆలోచనలు, ధైర్యం, విలువలు, కష్టాలను ఎదుర్కొనే శక్తి అని అన్నారు. కుటుంబం ఇచ్చే మానసిక బలం కష్టకాలంలో ఎంతో అవసరమని చెప్పారు. కుటుంబాల్లో ప్రేమ, గౌరవం, సహకారం పెరిగితే సమాజంలోనూ శాంతి, సామరస్యం పెరుగుతాయని అన్నారు.

**ప్రతిభకు గుర్తింపు.. సమాజానికి స్ఫూర్తి**

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తులతో పాటు సంస్కారం, సంప్రదాయం, సానుభూతి, మానవత్వాన్ని అందిస్తారని అన్నారు. ప్రస్తుతం మానవ సంబంధాలు బలహీనపడుతున్నాయని, కుటుంబ కలహాలు, హింస పెరుగుతున్న పరిస్థితుల్లో తల్లిదండ్రుల పట్ల ప్రేమ, గౌరవం, బాధ్యత మరింత అవసరమని పేర్కొన్నారు.సీనియర్ జర్నలిస్ట్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ పొన్నం సత్తయ్య మానవ విలువలు, మానవ సంబంధాలు, కుటుంబ విలువలకు ప్రతీక అని అన్నారు. ఆయన ఆలోచనలు, ఆశయాలను తరతరాలకు అందించాలనే ఉద్దేశంతో పురస్కారాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. సాహిత్య పురస్కార గ్రహీత వెలిచాల కొండల్‌రావు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం, అభిప్రాయాలు, ఆలోచనలకు ప్రజాస్వామ్యంలో ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. భిన్నమైన భావాలు, సిద్ధాంతాలకు చెందిన వ్యక్తులు ఒకే వేదికపై కలవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమన్నారు.

**విలువలకు వేదికగా.. సేవలకు గుర్తింపుగా**

పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారాలు–2026లో వ్యవసాయ రంగానికి ఎం. కోదండరెడ్డి, సాహిత్య రంగానికి వెలిచాల కొండల్‌రావు, జానపద కళారంగానికి గొట్టె కనకవ్వలను ఎంపిక చేశారు. ఒక్కొక్కరికి జ్ఞాపికతో పాటు రూ.50 వేల నగదు పురస్కారం అందించారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకరయ్య,నవీన్ యాదవ్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమాయాదేవి, అధికారులు, ప్రజాప్రతినిధులు, పొన్నం కుటుంబ సభ్యులు, అభిమానులు, సాహిత్య, కళా, వ్యవసాయ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 14.09.2026
www.mudranews.in | @mudranews



## వైరల్ జ్వరాలు రాకుండా..



దోమల నివారణకు చర్యలు తీసుకోండి. డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వైరస్ వ్యాధులు దోమల ద్వారా వ్యాపిస్తాయి. ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. అవసరమైతే దోమతెరలు, రిపెలెంట్లు ఉపయోగించడం మంచిది.

## వైభవంగా స్వామివారి నిత్య కళ్యాణోత్సవం



స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో ఆదివారం నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. సుమారు 5 వేల మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం స్వామి వారిని మాడ వీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీవారిని దర్శించుకున్నారు. - ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

## ఖమ్మంలో జనసేన 'తెలంగాణ శంఖారావం'




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 13 :** నసేన పార్టీ నిర్వహించిన 'తెలంగాణ శంఖారావం' సభ, దానికి ముందు చేపట్టిన భారీ బైక్ ర్యాలీ అత్యంత అట్టహాసంగా ముగిశాయి. ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ నగరంలోని ముఖ్య వీధుల మీదుగా ఎంబీ ఫంక్షన్ హాల్‌లోని 'పద్మశ్రీ వనజీవి రామయ్య ప్రాంగణం' వరకు సాగింది. వేలాదిగా తరలివచ్చిన జనసైనికులు, వీర మహిళల నినాదాలతో ఖమ్మం వీధులన్నీ మారుమోగాయి.ఈ వేదికగా ఇటీవల దారుణ హత్యకు గురైన అశ్వారావుపేట నియోజకవర్గ గిరిజన బాలికకు నేతలు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబానికి జనసేన అన్ని విధాలా అండగా ఉంటుందని, నిందితులకు కఠిన శిక్ష పడేవరకు పోరాడుతుందని భరోసా నిచ్చారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు నిస్వార్థ సేవలు అందించిన దివంగత వనజీవి రామయ్య గారి సతీమణి జానకమ్మను పార్టీ నేతలు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.సభలో జనసేన రాష్ట్ర నేతలు తాళ్లూరి రామ్, నేమూరి శంకర్ గౌడ్, సాగర్ ఆర్.కె. నాయుడు మాట్లాడుతూ.. తెలంగాణలో మార్పును కోరుకుంటున్న ప్రజలకు, యువతకు జనసేన ఏకైక ప్రత్యామ్నాయమని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శాసనమండలిలో పట్టభద్రులు, నిరుద్యోగుల గొంతుకగా నిలుస్తానని హామీ ఇచ్చారు. క్రమబద్ధమైన జాబ్ క్యాలెండర్, విద్యా వ్యవస్థ బలోపేతం కోసం జనసేన నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.



## విద్యుత్, సాగునీరు ఇవ్వలేని చేతకాని ప్రభుత్వం

### మాజీ మంత్రి పువ్వాడ



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 13 :** రైతులకు సాగునీరు, ఉచిత విద్యుత్ అందించలేక కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. గణేశ్వరంలో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్‌తో రైతులు దర్జాగా పంటలు పండించుకుంటే, నేడు కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలు, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోయే పాత రోజులు మళ్లీ వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఆనాడే చెప్పినట్లు మోసపోయి గోస పడుతున్నామని, తెలంగాణకు కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు.యూరియా కోసం రైతులను క్యూలైన్లలో నిలబెడుతున్నారని, రైతుబంధు సాయాన్ని ఓట్ల రాజకీయం కోసం వాడుకుంటూ పంటల సమయానికి అందించడం లేదని మండిపడ్డారు. రూ. 2 లక్షల రుణమాఫీని ఏ ఒక్క గ్రామంలోనూ పూర్తిగా అమలు చేయలేదని సవాలు విసిరారు. మహిళలకు నెలకు ₹2,500, తులం బంగారం, రూ. 4,000 పింఛన్, ₹500 లకే గ్యాస్ వంటి హామీలన్నింటినీ కాంగ్రెస్ నీరుగార్చిందని ధ్వజమెత్తారు. రైతు సంక్షేమం కోసం బిఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాసా రామారావు, ఆర్జెసీ కృష్ణ, గుత్తా రవి, మాధంశెట్టి హరిప్రసాద్, కొంటెముక్కల వెంకటేశ్వర్లు, పిన్ని కోటేశ్వరరావు, చెరుకూరి ప్రదీప్, దొంతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తరలి వెళ్లిన ఆర్య, వైశ్య సంఘం నాయకులు



**ముద్ర, దేవరకొండ:** రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మ గౌరవ భవన సముదాయం నిర్మాణానికి నిర్వహించిన భూమి పూజ పాల్గొనేందుకు మండలం నుంచి ఆర్యవైశ్యులు భారీగా తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో కొండమల్లేపల్లి, పీఏపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఊరె జనార్ధన్, విడియాల రామయ్య, విడియాల బిక్షమయ్య, జిన్నం రాంమూర్తి, దుండిగళ్ళ అశోక్, విడియాల సతీష్ కుమార్ తదితరులున్నారు

## వినాయక మట్టి విగ్రహాల పంపిణీ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** వాసవి క్లబ్ భువనగిరి వారి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ లో భాగంగా, వినాయక చవితి సందర్భంగా, వినాయక మట్టి విగ్రహాలను స్థానిక కెనరా బ్యాంకు ముందు పంపిణి చేశారు. కార్యక్రమానికి భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగేలపల్లి శ్రీవాణి రవికుమార్, 19వ వార్డు కౌన్సిలర్ బండారు స్వర్ణలత, భువనగిరి పట్టణ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు పసుపునూరి నాగభూషణం క్లబ్ అధ్యక్షులు బిజ్జాల మహేశ్, ప్రధాన కార్యదర్శి జంగాల హనుమంతరావు, కోశాధికారి రాచమల్ల లక్ష్మీనారాయణ, పోగ్రాం చైర్మన్ కొడితాల నవీన్, జోన్ చైర్మన్ పాలకుర్తి వేణుమాధవ్, రీజియన్ సెక్రటరీ ఆకుల రమేష్, మాజి డిప్యూటీ గవర్నర్ మంచాల ఋషికేష్, మాజి జోన్ చైర్మన్ చీకటిమల్ల రాములు, మాజి అధ్యక్షులు పసుపునూరి మనోహర్, మంచికంటి రవి,గాదె శ్రీనివాస్, పులిగిళ్ల సోమచంద్ర గుప్త, సీనియర్ సభ్యులు మంచికంటి వెంకటేశం, రావుల శ్రీధర్ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నోటీసుల జారీ విచారణ ప్రక్రియ వేగవంతం చేయాలి



**ముద్ర, దేవరకొండ:** నోటీసుల విచారణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని ప్రతి కేసుకు సంబంధించిన ధ్రువపత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలని ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటిస్తూ ముందుకెళ్లాలని ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి ఖచ్చితంగా మార్గదర్శకాలను పాటిస్తూ పారదర్శకంగా విచారణ నిర్వహించాలని దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియన్ మావి ఐఏఎస్ సూచించారు. ఆదివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ లో ఎస్ఐఆర్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు జారీ, వాటి పంపిణీ, విచారణ ప్రక్రియపై ఒక్కో బూత్ వారీగా ఆమె సమీక్షించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎన్నికల సంఘం గడువు పొడిగించిన నేపథ్యంలో ఈ వెసులుబాటును వినియోగించుకుని నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని అన్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా ప్రతిరోజూ బీఎల్ఓలు, సూపర్వైజర్ల పనితీరును పర్యవేక్షించాలని ఎలక్షన్ డిప్యూటీ తహసిల్దార్ ప్రశాంత్ కు సూచించారు. పెండింగ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి మిగిలిన నోటీసులు పంపిణీని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వేరే ప్రాంతానికి శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు ఉంటే అలాంటి వారు ఫారం – 8 సమర్పించేలా చూడాలన్నారు. చివరి నిమిషంలో హడావుడి పడకుండా గడువు కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేసేలా కృషి చేయాలని సబ్ కలెక్టర్ సూచించారు. వారివెంట ఎలక్షన్ డిప్యూటీ తహసిల్దార్ ప్రశాంత్, మండల రెవిన్యూ ఆఫీసర్ శ్రీనివాస్, అంగన్వాడీ సూపర్వైజర్లు, బిఎల్ఓస్లు ఉన్నారు.

## పువ్వాడ జన్మదినం సందర్భంగా ఉచితంగా కృత్రిమ పాదాల పంపిణీ




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 13 :** సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు 88వ జన్మదినాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ , పువ్వాడ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాల పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం ఆయన జన్మదిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ మానవతా సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలుత పువ్వాడ నాగేశ్వరరావు కేక్ కట్ చేశారు. తెలంగాణ మాజీ మంత్రి, పువ్వాడ తనయుడు పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ గత 14 ఏళ్లుగా నిరంతరాయంగా కొనసాగుతున్న ఈ బృహత్తర సేవ ద్వారా ఇప్పటివరకు 1,140 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాలను అమర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపినట్లు వెల్లడించారు.తన తండ్రి 88 నిండు వసంతాలు పూర్తి చేసుకున్న సంతోషకర సమయంలో, బాధితులకు చేయూతనందించాలనే ఉద్దేశంతో ఈ ఒక్క రోజే 88 మంది దివ్యాంగులకు కృత్రిమ పాదాలను అందజేసినట్లు పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమానికి కావలసిన ఆర్థిక సహాయం కోసం పువ్వాడ ఫౌండేషన్ తరఫున రూ. 3,52,000 నిధులను రోటరీ ట్రస్ట్‌కు అందజేసినట్లు వివరించారు.గత 30 ఏళ్లుగా ఖమ్మంలోని రోటరీ లింబ్ సెంటర్ వేలాది మందికి అపారమైన సేవలు అందిస్తోందని కొనియాడారు. 1996లోనే పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో 'మమతా హాస్పిటల్' ను స్థాపించామని, ఇప్పటివరకు లక్షలాది మందికి ఉచిత వైద్యం అందించామని గుర్తుచేశారు. ప్రజా పక్షాన నిలబడిన కమ్యూనిస్టు నాయకుడిగా తన తండ్రి చూపిన బాటలోనే తమ కుటుంబం విద్యా, వైద్య, సామాజిక రంగాల్లో సేవలను కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. దివ్యాంగుల ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు కృషి చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులకు, వైద్య బృందానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సేవా కార్యక్రమంలో ఖమ్మం రోటరీ ట్రస్ట్ చైర్మన్ మల్లాది వాసుదేవ్, రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ప్రెసిడెంట్ హరి శ్రీనివాస్, వైస్ చైర్మన్ కాళ్ళ పాపారావు, సెక్రటరీ దొడ్డపనేని సాంబశివరావు, వంగల జగన్నాథం, పసుమర్తి రంగారావు, ప్రసాద్, చిటోజు రామకృష్ణ, వల్లభనేని రామారావు, ఆర్ జేసి కృష్ణ, పగడాల నాగరాజు, బత్తుల మురళీ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల కోసం అల్లాను వేడుకున్న ముస్లింలు



**ముద్ర, దేవరకొండ:** వర్షాలు సమృద్ధిగా కురిసి కరువు పరిస్థితులు తొలగి పాడిపంటలు పచ్చగా కళకళలాడాలనీ, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ స్థానిక ఈద్గాలో ఆదివారం ముస్లిం సోదరులు ప్రత్యేకంగా ఇస్తిస్కా నమాజ్ నిర్వహించారు. హజ్రత్ మౌలానా ముఫ్తీ సయ్యద్ అమ్జద్ అలీ ఖాస్మీ సాహబ్ (ఖతీబ్–ఏ–ఈదైన్) ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో ఈద్గా మైదానానికి చేరుకుని ఇస్తిస్కా నమాజ్‌ను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. నమాజ్ అనంతరం మౌలానా సయ్యద్ అమ్జద్ అలీ ఖాస్మీ సాహబ్ ప్రత్యేక దువా నిర్వహించారు. అల్లాహ్ తాలా తన కరుణను కురిపించి సమృద్ధిగా వర్షాలు కురిసేలా చేయాలని చెరువులు, కుంటలు, బావులు నీటితో నిండాలని, రైతుల పంటలు పుష్కలంగా పండాలని ప్రార్థించారు. అలాగే పాడిపంటలు సస్యశ్యామలంగా మారి రైతులు, కూలీలు, వ్యాపారులు, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి కుటుంబంలో సంతోషం, శాంతి, సౌభాగ్యం నెలకొనాలని అల్లాహ్‌ను వేడుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఏకమై వర్షాల కోసం ప్రార్థనలు చేయడం విశేషంగా నిలిచింది. ఇస్తిస్కా నమాజ్ అనంతరం ప్రజలు పరస్పరం శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీమోద్దీన్, షబ్బీర్ అహ్మద్, ముఫ్తీ రిజ్వాన్, మాజీద్ మౌలానా, హబీబ్ మౌలానా, ఇలియాస్ పటేల్, ఖుద్ర తుల్లా, బషీర్ సాబ్, అలీమ్ మౌలానా, ఫయాజోద్దీన్, ముజీబ్, ఖాజా, దస్తగిర్, షబ్బీర్, వాజీద్ పాషా, ఖలేఖ్, ఖైసర్, ఇలియాస్ బాబా తదితరులతో పాటు దాదాపు వెయ్యి మంది పాల్గొన్నారు.

## తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



**ముద్ర, దేవరకొండ:** ప్రతి తండ్రి తన అంతిమ సంస్కారాలు చేసేందుకు కొడుకును వారసుడిగా కోరుకుంటాడు. అయితే కొడుకు కంటే కూతురేం తక్కువ కాదంటూ కూతురే కొడుకై తండ్రికి తల కొరివి పెట్టింది. కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన ఒక అమ్మాయి. తండ్రికి తలకొరివి పెట్టి ప్రశంసలు అందుకుంటోంది. ప్రపంచ మంతా టెక్నాలజీలో జెట్ స్పీడ్‌తో ముందుకెళ్తున్నా సమాజంలో స్త్రీ, పురుష బేధభావాలు కొనసాగుతూనే ఉన్నాయి. చదువు ఉద్యోగం టెక్నాలజీలో పురుషులకు ధీటుగా దూసుకుపోతున్నా పితృకర్మల విషయాల్లో స్త్రీలపై ఆంక్షలు అలాగే ఉన్నాయి. తల్లిదండ్రులు చనిపోతే కొడుకులే కర్మలు చేయాలి ఒకవేళ వారికి మగపిల్లలు లేకపోతే బంధువుల్లో ఎవరైనా కర్మకాండలు నిర్వహిస్తారు. కానీ ఇప్పుడు కొంతమంది మహిళల్లో మార్పులొస్తున్నాయి. అలాంటి కట్టుబాట్లకు చెక్ పెడుతున్నారు. మగపిల్లలను కన్నట్లుగానే ఆడపిల్లలను కన్నారు. అలాంటప్పుడు తామెందుకు చేయకూడదంటూ తల్లిదండ్రుల కర్మకాండలు నిర్వహిస్తున్నారు. తాజాగా కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామంలో తండ్రి చనిపోతే తలకొరివి పెట్టి ప్రశంసలు అందుకున్న బొడ్డుపల్లి నవ్య. బొడ్డుపల్లి యాదయ్య (50)అనారోగ్యంతో చనిపోయారు. అయన ఇద్దరూ అమ్మాయిలే. చనిపోయిన వ్యక్తికీ అబ్బాయిలు లేకపోవడంతో బొడ్డుపల్లి యాదయ్య అంత్యక్రియలు కూతుళ్లు నిర్వహించారు. అంతేకాదు మరో అడుగు ముందుకేసి కూతురే కొడుకుగా మారి తండ్రికి తలకొరివి పెట్టింది. దాంతో కొందరు ఆశ్చర్యపోయినప్పటికీ రోజులు మారుతున్నప్పుడు సంప్రదాయాలు కూడా మారాల్సిన అవసర ముందంటూ ఆమెకు అండగా నిలిచి అన్ని కార్యక్రమాలు దగ్గరుండి జరిపించారు గ్రామస్తులు. తండ్రికి తలకొరివి పెట్టిన కూతుర్ని అభినందించారు.

## 17 న తెలంగాణ రాష్ట్ర సంపూర్ణ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

### తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి అధ్యక్షులు గొట్టిపాముల బాబూరావు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** సెప్టెంబర్ 17 న జరిగే "తెలంగాణ రాష్ట్ర సంపూర్ణ స్వాతంత్ర్య దినోత్సవాన్ని "తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి" ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో "తెలంగాణ అమరవీరుల సంస్మరణ స్థూపం" వద్ద ఘనంగా నిర్వహించాలని సమితి అధ్యక్షులు గొట్టిపాముల బాబూరావు పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి 1947 ఆగష్టు 15న స్వాతంత్ర్యం వచ్చినా, తెలంగాణ రాష్ట్రానికి 1948 సెప్టెంబర్ 17 న సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చిన విషయం మరువరాదన్నారు. రాష్ట్ర సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం అనేక మంది వీరులు ప్రాణ త్యాగం చేసారని, ఆ వీరులను స్వాతంత్ర్య సమరయోధులు గా గుర్తించాలని ఆయన కోరారు. అలాగే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం 1969 నుంచి 2014 వరకు సుదీర్ఘ ఉద్యమం కొనసాగిందని ఆయన గుర్తుచేశారు. ఎందరో అమర వీరులు బలిదానాలు చేసి మనకు స్వాతంత్ర్యాన్ని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని, వారందరినీ జ్ఞాపకం చేసుకోవడం, వారి గురించి భవిష్యత్తు తరాలకు తెలియజేయడం మనందరి కర్తవ్యమని ఆయన అన్నారు. సెప్టెంబర్ 17 న ఆ అమరుల త్యాగాలు, పోరాటాలు, మరియు బలిదానాలను స్మరించుకుందామని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి ఉపాధ్యక్షులు కొత్త బాలరాజు, ప్రధాన కార్యదర్శి కొడారి వెంకటేష్, సహాయ కార్యదర్శి షేక్ హమీద్ పాషా సభ్యులు సుర్వి శ్రీనివాస్, మాటూరి అశోక్, కమ్మ వెంకటేష్, డాకూరి ప్రకాష్ పాల్గొన్నారు.

## 22ఏ లెక్కల గందరగోళానికి తెరదించాలి

### బిజేపి నేత సుధాకర్‌రెడ్డి

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 13 :** తెలంగాణలో 22ఏ నిషేధిత భూములకు సంబంధించిన గణాంకాలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత నివ్వాలని బీజేపీ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ డా. పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. 22ఏ పరిధిలోని భూముల విస్తీర్ణం తగ్గింపుపై ప్రభుత్వం వద్ద సరైన లెక్కలు లేవని ఆరోపించారు.గత గణాంకాల ప్రకారం కేవలం 47,440 ఎకరాలు తగ్గినట్లు కనిపిస్తుంటే, మీడియాలో మాత్రం ఐదు లక్షల ఎకరాలు తగ్గినట్లు ప్రచారం జరుగుతోందని, అసలు వాస్తవం ఏంటో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. కేవలం రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరగడాన్ని సమస్య పరిష్కారానికి సూచికగా చూపడం సరికాదని, మార్కెట్ విలువల పెంపు వల్లే ఆదాయం పెరిగిందని తెలిపారు. దేవాదాయ భూముల వర్గీకరణ, భూ విస్తీర్ణాల్లో కనిపిస్తున్న 4.02 లక్షల ఎకరాల వ్యత్యాసంపై పారదర్శకమైన వివరణ ఇవ్వాలని కోరారు.సుమారు 25 వేల ఇళ్లు ఇప్పటికీ 22ఏ చిక్కుల్లో ఉన్నాయని, వారి సమస్యల పరిష్కారానికి కాలపరిమితితో కూడిన ప్రణాళికను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఆస్తులకు చట్టబద్ధమైన రక్షణ కల్పిస్తూ జిల్లా, మండలం, గ్రామం, సర్వే నంబర్ వారీగా పూర్తి వివరాలతో కూడిన 'వైట్ పేపర్'ను విడుదల చేయాలని సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 14.09.2026
www.mudranews.in | @mudranews



### వైరల్ జ్వరాలు రాకుండా



చేతులను తరచూ శుభ్రం చేసుకోండివైరస్‌లు చేతుల ద్వారా శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. బయట నుంచి ఇంటికి వచ్చిన తర్వాత, భోజనం ముందు, టాయిలెట్ ఉపయోగించిన తర్వాత సబ్బుతో కనీసం 20 సెకన్ల పాటు చేతులు కడుక్కోవడం అలవాటు చేసుకోవాలి.

# లోక్ అదాలత్‌లో 5,254 కేసుల పరిష్కారం

**సైబర్ క్రైమ్ 14 కేసుల్లో రూ.20.27 లక్షలు బాధితులకు రీఫండ్**
**ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:** జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా మెదక్ జిల్లాలో పోలీసు, న్యాయశాఖల సమన్వయంతో వివిధ రకాల కేసులను సత్వరమే పరిష్కరించినట్లు ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో మొత్తం 5,254 కేసులకు పరిష్కారం లభించిందని వెల్లడించారు. వీటిలో 3,984 డీడీ కేసులు, 538 ఐపీసీ కేసులు, 732 ఈ–పెట్టీ కేసులు ఉన్నాయని వివరించారు.సైబర్ నేరాల బాధితులకు ఊరట కల్పించేలా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో 14 సైబర్ క్రైమ్ కేసుల్లో కోర్టు ఆదేశాల మేరకు



మొత్తం రూ.20 లక్షల 27 వేల నగదును బాధితులకు రీఫండ్ చేసినట్లు వెల్లడించారు. సైబర్ మోసానికి గురైన వారు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలుపుదల చేసి తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.కేసుల పరిష్కార ప్రక్రియలో కోర్టు డ్యూటీ అధికారులు, దర్యాప్తు అధికారులు, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది సమన్వయంతో పనిచేసి విశేష కృషి చేశారని ఎస్పీ అభినందించారు. బాధితులకు త్వరిత గతిన న్యాయం అందేలా సంబంధిత కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన న్యాయపరమైన చర్యలను సమర్థవంతంగా పూర్తి చేసిన అధికారులను ప్రశంసించారు.ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో జాతీయ లోక్ అదాలత్ ఒక సమర్థవంతమైన వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకుని సత్వర న్యాయం పొందాలని ప్రజలకు సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి పోలీసు శాఖ తరపున పూర్తి సహకారం అందిస్తామని ఎస్పీ తెలిపారు.

# ఆపరేషన్ సింధూర్‌పై ఐఏఎఫ్ సంచలన రిపోర్ట్

**పాక్ ఎఫ్-16లు, రాడార్లు ధ్వంసం**
**ఆపరేషన్ సింధూర్‌పై ఐఏఎఫ్ వార్షిక నివేదికలో కీలక వివరాలు**
**పలు పాక్ ఎఫ్-16లు ధ్వంసమయ్యాయని వెల్లడి**
**ఒక ఏఈడబ్ల్యూసీ విమానం కూడా లక్ష్యంగా మారిందని ప్రకటన**
**జాకోబాబాద్‌లో నాలుగు విమాన హ్యాంగర్లపై దాడులు**
**ఆరు రాడార్లు, రెండు ఎయిర్ డిఫెన్స్ ఆయుధ ప్రాంతాలు టార్గెట్**




**ముద్ర డెస్క్**

ఆపరేషన్ సింధూర్ దాడులతో పాకిస్తాన్‌లో భారత్ విధ్వంసమే సృష్టించింది. తాజాగా కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 2025–26 వార్షిక నివేదికలో భారత వైమానిక దళం (IAF) కీలక విషయాలను వెల్లడించింది. 2025 ఏప్రిల్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిగా భారత్ మే6–7, 2025న ఆపరేషన్ సింధూర్ ప్రారంభించింది. పాకిస్థాన్ ఆక్రమిత జమ్మూకశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను భారత్ లక్ష్యంగా చేసుకుంది. అనంతరం పాకిస్థాన్ భారత సైనిక, పౌర ప్రాంతాలపై దాడులకు ప్రయత్నించడంతో భారత్ పాకిస్థాన్ సైనిక స్థావరాలపై దాడులు చేసింది.పాక్ ఎయిర్ బేసులు ధ్వంసం..ఐఏఎఫ్ నివేదిక ప్రకారం.. పాకిస్తాన్ భారత్ పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్లు, వైమానిక దాడులు చేసే ప్రయత్నం చేయడంతో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ధీటుగా స్పందించింది. పాక్‌లోని నూర్ ఖాన్, రహీమ్ యార్ ఖాన్, జాకోబాబాద్ వైమానిక స్థావరాలతో పాటు పలు కీలక స్థావరాలపై దాడులు చేసింది. ఈ దాడుల్లో హ్యాంగర్లు, రన్‌వేలు ధ్వంసమయ్యాయి.జకోబాబాద్ ఎయిర్ బేసులో నాలుగు విమాన హ్యాంగర్లపై దాడి చేసినట్లు వెల్లడించింది. ఈ దాడుల్లో పాక్‌కు చెందిన F-16 యుద్ధ విమానాలు, ఒక AEW&C విమానం, అలాగే టర్కీకి చెందిన అకిన్సీ, TB–2 తరగతికి చెందిన పలు మానవరహిత కాంబాట్ ఏరియల్ వెహికల్స్ (UCAVs) ధ్వంసం లేదా దెబ్బతిన్నాయని పేర్కొంది. పాక్ సైన్యానికి చెందిన పలువురు మరణించినట్లు వెల్లడించింది.రాడార్లు, కమాండ్ సెంటర్లు ఖతం..పాకిస్తాన్ వైమానిక రక్షణ వ్యవస్థకు చెందిన రాడార్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు ఐఏఎఫ్ వెల్లడించింది. చక్లాలా, రహీమ్ యార్ ఖాన్, సుక్కూర్, మురీద్, సర్గోధా, జాకోబాబాద్, భోలారీ ప్రాంతాల్లోని కీలక వైమానిక రక్షణ కేంద్రాలను ఇండియన్ ఎయిర్ ఫోర్స్ టార్గెట్ చేసినట్లు నివేదిక పేర్కొంది. పాకిస్తాన్ ఎయిర్ ఫోర్స్ ఎయిర్ డిఫెన్స్ కమాండ్ ప్రధాన కార్యాలయం చక్లాలో ఉన్నట్లు నివేదిక చెప్పింది. మొత్తం 6 రాడార్లు, 2 ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే గైడెడ్ వెపన్స్ ప్రాంతాలపై దాడులు చేసినట్లు తెలిపింది. సర్గోధా, రహీమ్ యార్ ఖాన్, ఎయిర్ బేస్ రన్‌వేలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు నివేదిక వెల్లడించింది.S-400తో 314 కిలోమీటర్ల దూరంలో భారీ దాడి..ఆపరేషన్ సింధూర్‌తో S-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ద్వారా 314 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాకిస్తాన్‌కు చెందిన ఒక ప్రత్యేక మిషన్ విమానాన్ని ధ్వంసం చేసినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ నివేదిక తెలిపింది. ఈ ఘటనను ప్రపంచంలోనే అత్యంత దూరం నుంచి జరిగిన 'సర్ఫేస్–టు–ఎయిర్ కిల్'గా ఐఏఎఫ్ అభివర్ణించింది. అయితే, కూలిన పాకిస్తాన్ విమానం ఏ రకం అనేది నివేదికలో వెల్లడించలేదు.ఆపరేషన్ సమయంలో ఆకాశ్, పచోరా, ఓఎస్ఏ-ఏకే ప్లాట్‌ఫారమ్‌ల ఉపయోగించినట్లు ఐఏఎఫ్ తెలిపింది. ఈ వ్యవస్థల సమన్వయం ద్వారా డ్రోన్లు, క్షిపణులు, యూఏవీలు, లోయిటరింగ్ మ్యూనిషన్ల వంటి గగనతల దాడుల్ని అడ్డుకున్నట్లు వెల్లడించింది.

# ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ నూతన విద్యావిధానం

**ప్రపంచంతో పోటీపడేలా కొత్త విద్యా విధానం**
**విద్యా బడ్జెట్‌ను 15 శాతానికి పెంచే లక్ష్యం**
**కేకే నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు**
**గ్లోబల్ స్టాండర్డ్స్‌తో విద్యలో సంస్కరణలు**




**ముద్ర డెస్క్**

తెలంగాణ శాసనసభలో విద్యాశాఖపై జరిగిన సమగ్ర చర్చ సభలో ఒక శుభపరిణామమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. శాసనసభ వేదికగా విద్యా వ్యవస్థ బలోపేతం , ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. విద్య ఒక్కటే మానవ జీవితాల్లో శాశ్వత వెలుగులను నింపుతుందని సంపూర్ణంగా నమ్ముతున్నానని, శాసనసభలోని సభ్యులు ఇచ్చే విలువైన సూచనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.నెహ్రూ వేసిన పునాదులే నేటి విద్యావ్యవస్థకు మూలందేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్య, నీటిపారుదల రంగాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. దేశంలోని నేటి ప్రముఖ విద్యాసంస్థలన్నీ నెహ్రూ వేసిన బలమైన పునాదులపైనే నిర్మితమయ్యాయని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలో నేడు అందుబాటులో ఉన్న మెజారిటీ యూనివర్సిటీలు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే ఏర్పాటు చేసినవని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన 'సీపెక్' సర్వేలోనూ ఆస్తులు, అంతస్తులు లేకపోవడం సామాజిక వెనుకబాటుతనానికి కారణం కాదని, కేవలం విద్య లేకపోవడమే దానికి ప్రధాన కారణమని తేలిందని వెల్లడించారు. ప్రపంచంతో పోటీ పడాలంటే విద్యా విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.విద్యారంగ బడ్జెట్ 15 శాతానికి పెంపే లక్ష్యం: కేకే కమిటీ ఏర్పాటుప్రపంచ పోటీకి తట్టుకునేలా తెలంగాణ నూతన విద్యా విధానాన్ని రూపొందించేందుకు ఇప్పటికే విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యా కమిషన్ అందించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించేందుకు సీనియర్ నాయకులు కే కేశవరావు నేతృత్వంలో ప్రత్యేక కమిటీని నియమించినట్లు చెప్పారు. సభ్యులెవరైనా తమ సూచనలు, సలహాలను కేశవరావు కమిటీకి అందిస్తే ప్రభుత్వం స్వీకరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో విద్యారంగానికి బడ్జెట్‌లో కేటాయింపులను 15 శాతానికి పెంచడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం వివరించారు.

**విద్యాశాఖ నా వద్ద ఉండటం గర్వకారణం:**

బీజేపీ ఎమ్మెల్యేకు కౌంటర్ శాసనసభలో ప్రత్యేకంగా విద్యాశాఖ మంత్రి లేరని బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖను నిర్వహిస్తున్నారంటే ఆ రంగానికి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో అర్థం చేసుకోవాలని హితవు పలికారు. ముఖ్యమంత్రిగా తాను విద్యాశాఖపై సమీక్ష నిర్వహిస్తే మొత్తం ప్రభుత్వ యంత్రాంగం , సిస్టమ్ అంతా సమిష్టిగా అందులో భాగమవుతుందని చెప్పారు. తనకు ఈ శాఖపై ప్రత్యేక ప్యాషన్ ఉందని, దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుందనే నమ్మకంతోనే విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని తెలిపారు. తాను విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏకంగా 86 వేలకు పెరిగిందని, ఇది తన పనితీరుకు ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. కేటాయిం పుల పెంపు, ఉద్యోగాల భర్తీగత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోలిస్తే తమ ప్రభుత్వం విద్యా రంగానికి కేటాయింపులను రికార్డు స్థాయిలో పెంచిందని సీఎం రేవంత్ రెడ్డి గణాంకాలతో వివరించారు. 2023–24 బడ్జెట్‌లో గత ప్రభుత్వం విద్యా శాఖకు రూ. 19,093 కోట్లు కేటాయిస్తే, తమ ప్రభుత్వం 2024–25 బడ్జెట్‌లో ఆ మొత్తాన్ని రూ. 21,292 కోట్లకు పెంచిందని తెలిపారు. అలాగే 2025–26 బడ్జెట్‌లో రూ. 23,108 కోట్లకు, 2026–27 బడ్జెట్‌లో రూ. 26,647 కోట్లకు పెంచామని, కేవలం మూడేళ్ల వ్యవధిలోనే విద్యా శాఖ బడ్జెట్‌ను రూ. 7,554 కోట్లకు పెంచామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన మొదటి ఏడాదే, అదీ కేవలం 55 రోజుల వ్యవధిలోనే ఎలాంటి చిన్న ఆరోపణలకు తావులేకుండా పారదర్శకంగా 10,006 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో కేవలం 7,857 టీచర్ పోస్టులను మాత్రమే భర్తీ చేసిందని ఎద్దేవా చేశారు.భవిష్యత్ తరాల కోసం గ్లోబల్ ప్రాక్టీసెస్ప్రస్తుత జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్లోబల్ స్టాండర్డ్స్‌కు అనుగుణంగా విద్యా విధానాన్ని రూపొందిస్తున్నట్లు సీఎం తెలిపారు. మనుషుల తలరాతలను మార్చే శక్తి విద్యకే ఉందని నమ్మి ప్రపంచంలో ఉన్న అత్యుత్తమ విద్యా పద్ధతుల ను తెలంగాణకు తీసుకొస్తున్నామని చెప్పారు. పాలిటెక్నిక్ కాలేజీల జీవో ఎంఎస్ నెం. 97 వంటి కొన్ని నిర్ణయాలు తీసుకున్నప్పుడు వివాదాలు రావడం సహజమేనని, అయితే విద్యార్థుల భవిష్యత్తే తమకు అంతిమ ప్రాధాన్యమని సీఎం పునరుద్ఘాటించారు.

## తెలంగాణ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు కేసీఆర్



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వ్యవసాయం తిరిగి గాడిన పడాలని, పాడి పంటలతో తెలంగాణ రైతు కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లేలా దీవించాలని కోరుతూ ఏకదంతుడైన వినాయకుడిని ప్రార్థించారు.

## వినాయక చవితి, నవరాత్రులకు మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు

**ముద్ర, హైదరాబాద్:** వినాయక చవితి, నవరాత్రుల పర్వదినాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలంతా భక్తిశ్రద్ధలతో పండుగలను జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.వినాయకుడి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, ప్రతి కుటుంబం ఆనందంగా, సుభిక్షంగా ఉండేలా ప్రజా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతం కావాలని గణనాథుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పండుగలు ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

## 16న సీఐటీయూ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష

**జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా కేంద్రంలో 16న జరిగే నిరహార దీక్షలో జిల్లాలోని కార్మికులు అందరూ పాల్గొనాలని సిఐటీయు జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం పిలుపునిచ్చారు. అసెంబ్లీ జరిగిన ఐదు రోజుల లో ఒక్కరోజు కూడా రాష్ట్ర ప్రజలు, రైతులు,కార్మికుల సమస్యల పై చర్చ జరగలేదు.అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యల పై మాట్లాడాలని ఇందిరా పార్క్ వద్ద కు ధర్నా కు వెళ్తున్న ఆశా,అంగన్వాడి మహిళలను ముందస్తు అరెస్టులు,స్టేషన్ లకు తీసుకెళ్లడం,కేసులు నమోదు చేయడం,మహిళలు అని చూడకుండా లాఠీ ఛార్జీ చేయడం వంటి దుర్మార్గపు చర్చలకు ప్రభుత్వం పాల్పడింది. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలపై చర్చించకుండా పార్టీ లలో ఒకరిమీద ఒకరు వ్యాఖ్యలు చేసుకున్నారు. ప్రభుత్వం కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ కార్మికులందరూ సెప్టెంబర్ 16న మెదక్ పోస్టాఫీసు వద్ద ఉదయం 10 గంటలకు సిఐటీయు ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు ఉంటాయి.గ్రామ పంచాయతీ కార్మికులు, అంగన్వాడి ,ఆశ,పరిశ్రమల కార్మికులు, మున్సిపల్ కార్మికులు,మధ్యాహ్న భోజనం కార్మికులు అందరూ తప్పకుండా రావాలనీ తెలియజేసారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె సంతోష్ పాల్గొన్నారు.

## బ్రిక్స్ సదస్సుకు బంగ్లాదేశ్ దూరంగా ఉండటంపై ఢాకా అసంతృప్తి.

**భారత్‌తో సంబంధాలపై బలుపు మాటలు.**
**"ఎప్పుడూ భారత్ గురించే ఆలోచించలేం" అంటూ కీలక వ్యాఖ్యలు.**
**షేక్ హసీనా హయాంలో లాగా సంబంధాలు ఉండవని స్పష్టం**



**ముద్ర డెస్క్**

బ్రిక్స్ సమావేశాలకు దూరంగా ఉన్న బంగ్లాదేశ్ ఇప్పుడు తన కోపాన్ని వెలిబుచ్చుతోంది. ఆ దేశ విదేశాంగ సహాయక మంత్రి హుమాయున్ కబీర్ మాట్లాడుతూ.. ''మనం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం చేసేటప్పుడు కూడా భారత్ గురించే ఆలోచించలేము. మనం దానిని అధిగమించాలి'' అంటూ వ్యాఖ్యానించారు. భారతదేశంతో తమ సంబంధాలనున పున:ప్రారంభించాలని, కొత్త మార్గాలను నిర్వచించుకోవాలని, గత 15 ఏళ్ల పద్ధతుల్ని అధిగమించాలని కోరుకుంటోందనీ అన్నారు.ఆదివారం ఆ దేశ మీడియా అడిగిన ప్రశ్నలకు ఒకింత అసహనంతో కబీర్ సమాధానాలు చెప్పారు. ఐక్య రాజ్యసమితి సర్వసభ్య సమావేశాల సందర్భంగా ప్రధానమంత్రి తారిఖ్ రెహ్మాన్ భారత ప్రధాని నరేంద్ర మోడీని కలుస్తారా? అనే ప్రశ్నకు సమాధానంగా.. ''మీ ప్రశ్న సరైనది కాదు. భారత్‌పై మీకున్న వ్యామోహాన్ని వదిలేయండి. భారత్ కేవలం మరో పొరుగు దేశం మాత్రమే, దానితో మేము మంచి ద్వైపాక్షిక సంబంధాలు కోరుకుంటున్నాము'' అని అన్నారు. గత 15 ఏళ్ల పద్ధతుల నుంచి ముందుకు సాగాలని అనుకుంటున్నామని, షేక్ హసీనా హయాంలో ఉన్నట్లు బంగ్లాదేశ్–భారత్ సంబంధాలు కొనసాగయని చెప్పకనే చెప్పారు.బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో బంగ్లాదేశ్ ప్రధానికి భారత్ పంపిన ఆహ్వానంపై ఆ దేశం కోపంతో ఉంది. భారత్ బంగ్లాదేశ్ ప్రధానిగా కాకుండా, బిమ్స్టెక్ (BIMSTEC) ఛైర్మన్‌గా తారిఖ్ రెహ్మాన్‌ను ఆహ్వానించింది. ఈ ఆహ్వానం నేరుగా తమ ప్రధానికి పంపలేదని, అందుకే తమ ప్రధాని ఈ సదస్సుకు హాజరుకావడం లేదని బంగ్లాదేశ్ చెబుతోంది.

## వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు నూతన సీసీ, పీఆర్వో నియామకం



ముద్ర, వరంగల్, సెప్టెంబర్ 13 : వరంగల్ పోలీసు కమిషనరేట్ క్యాంపు క్లర్క్ (సీసీ)వేణుగోపాల్ రావు, పౌర సంబంధాల అధికారి (పీఆర్వో) మోహన కృష్ణ పై బదిలీ వేటు పడింది. వారి స్థానంలో స్పెషల్ బ్రాంచ్ విభాగంలో పనిచేస్తున్న ఏవో ఇషాక్ ను కొత్త సీసీగా, పీర్వోగా సుబేదారి పీఎస్ లో పనిచేస్తున్న కానిస్టేబుల్ తిరుపతిని పోలీసు కమిషనర్ ఎన్ శ్వేత నియమించారు. ఈమేరకు శనివారం పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ పాత సీసీ వేణుగోపాల్ రావు, పీఆర్వో మోహన కృష్ణ సుదీర్ఘ కాలంగా ఒకే పోస్టింగ్లో పనిచేస్తూ వీధుల దుర్వినియోగం పాల్పడినట్లు ఆరోపణల రావడంతో పోలీసు కమిషనర్ శ్వేత స్పందించారు. విచారణ జరిపించి బదిలీ వేటు వేశారు. వేణుగోపాల్ ను వరంగల్ రేంజ్ డీఐజీ ఆఫీస్ బదిలీ చేయగా, పీర్వో మోహనకృష్ణను స్టేషన్ ఘనపూర్ పోలీసు స్టేషన్ కు బదిలీ చేయగా వారి స్థానంలో వరంగల్ పోలీసు కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఏవో గా పనిచేస్తున్న ఇషాక్ ను కొత్త సీసీగా, సుబేదారి పీఎస్ లో పనిచేస్తున్న కానిస్టేబుల్ తిరుపతిని పీర్వో గా నియమిస్తూ పోలీసు కమిషనర్ శ్వేత శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555